# హిందూమత ప్రదర్శనము - 1860

విశాఖ పట్టణములో నుండే క్రీస్తు భక్తులు ఆంధ్రదేశస్థులైన ప్రజలకందరికీ వినయపూర్వకముగా వ్రాసిన వుత్తరము

ప్రియమైన మా దేశస్థులారా, ఈ హిందూ రాజ్యములో మీ వలెనే మేమున్ను పుట్టి పెరిగినాము మరన్ని బహు కాలపర్యంతము మీ మతాచారముల చొప్పున మేమున్ను నడుస్తూ వుంటిమి అయితే యింతట దేవుని దయచేత పాపాత్ముల రక్షణ కొరకు ఈ లోకమునకు పంపించబడిన ప్రభువైన యేసుక్రీస్తు అనే పరమ సూర్యుడు మా యొక్క ఆత్మాకాశములపైని ప్రకాశించుటవల్ల మా హృదయములు అజ్ఞాన తమస్సు అనే నిద్రనుంచి మేల్కొని మా అంతర్నేత్రములు తెరవబడెను - దానివల్ల ఆత్మ రక్షణోపాయమును గురించి నిజమైన మతము యేదో అబద్ధపు మతములు యేవో వాటిని బాగా పరీక్ష చేసినాము. ఆ పరీక్షవల్ల నిజమునుకనుగొని అంగీకరించుటకున్ను అబద్ధము కనుగొని వాటిని పరిహరించుటకున్ను తగిన బలమును బొంది యున్నాము. ఈలాగున ప్రభువైన యేసుక్రీస్తు యందు మేము నమ్మిన తరువాత ఆయన ఆజ్ఞ ప్రకారము మేము మీతో హితమైన సంగతులు చెప్పవలెనని కోరుతున్నాము గనుక చిత్తగించండి.

ప్రియమైన స్నేహితులారా, మొదటి సంగతి యేమంటే బుద్ధికి యేది తగినది కాదో యుక్తికి యేది సరిపడనిదో న్యాయమునకు యేది విరోధమైనదో అటువంటివి అన్నీ మేము మాత్రమే కాదు మీలోనున్న తెలివి గల బుద్ధిమంతులు విడిచి పెట్టవలసినదని వొప్పుకొంటారు గదా - అవును అవి విడిచి పెట్టి యేది మన కందరికీ మేలైయున్నదో అది మనము అంగీకరించవలెను.

అయితే ప్రియమైన మా దేశస్థులారా, చీకటిని వెలుగు అనిన్ని, చేదును తీపె అనిన్ని, కీడును మేలు అనిన్ని, ఈలాగున విపరీతముగా మాట్లాడేవారు మనదేశములో చాలామంది కలరు. అటువంటి వారితో మేము యేలాగున మాట్లాడగలము యేమి బుద్ధి చెప్పగలము? సత్యము వారు యేలాగున గ్రహించగలరు? వారు వ్యర్థముగా మా మీద కోపపడడమే యెరుగుదురు గాని మరి యేమైనా యెరుగుదురా - మేము క్రీస్తుమతము అవలంబించిన హేతువు నిదానించి తెలుసుకొనక మేము జాతి చెడగొట్టుకొన్నామనిన్ని, తాము ఆరాధిస్తూ వున్న వేల్పులను మేము వదిలివెయ్యడమే కాకుండా వాటిని ఆక్షేపించి దూషించుచున్నామనిన్ని తలంచి మా పైని నేరము మోపుతున్నారు. యీ సంగతి మాత్రమే వారి తెలివికి గోచరమైనందున వారి దృష్టికి మేము అసహ్యులమైతిమి.

అయితే ప్రియమైన మా దేశస్థులారా, మీలో బుద్ధిమంతులున్ను, చదువు కొన్న వారున్ను, న్యాయాయన్యాములు తెలిసిన వారున్ను కొందరు వుందురు. గనుక మీరైనా అది విచారించండని కోరుతున్నాము. మా మీద మోపబడియున్న రెండు నేరములలో మేము జాతి చెడగొట్టుకొన్నామనేది మొదటిది.

మేము జాతి వదులు కోవడము నిజమే అయితే అది నేరమా - కాదు. యెందుకంటే సృష్టికర్తయైన నిజదేవునికిన్ని ఆయన ప్రియకుమారుడైన యేసుక్రీస్తుకున్ను జాతియైనా జాతి భేదములైనా లేవు గనుక వారికి లేని జాతి వారిని నమ్మియున్న సేవకులమైన మాకుయేలాగువుండును. అయితే జాతి అనగా యేమిటో యే సంబంధమైనదో మన దేశస్థులు దాని గురించి బాగా యెరుగరని మేము విచారపడుతున్నాము. చూడండి దేవుడు మొదట సృష్టించిన మనుష్యజాతి ప్రకారమే మేము వున్నాముగాని క్రైస్తవులమైన తరువాత మా శరీరావయవములయందు యేదిన్ని మార్పు కాలేదు. అయితే వొకటి మాత్రమే పోయినది - యేదంటే హిందూ జనులమీద పిశాచి కప్పియుంచిన కులాచార భేదమనే గర్వపు ముసుకు

మా మీదినుంచి పోయినది. జాతిని గురించి యిక్కడ అధికముగా మేము చెప్పుటకు ప్రయోజనములేదు. యేమంటే యింతకు ముందు కులాచారపరీక్షయనే గ్రంథము అచ్చువేయబడి యున్నది. గనుక అది మీరు సంపాదించి జాగ్రత్తగా చదివి తెలుసుకొన్నట్టయితే మీరే మీలో వున్న ఆ దూషకుల నోళ్లు యెత్తకుండా చేయవచ్చును.

యిదిగాక మీరు ఆరాధన చేస్తూ వున్న మీ ఇష్టదైవములను మేము ఆక్షేపించి దూషిస్తున్నామని మా మీద ఆపాదించబడిన రెండవనేరమును గూర్చినది వట్టిదే - యేమంటే ఆలాగున మేము చేయలేదు. మీ వేల్పులను దూషించుటకైనా ఆక్షేపించుటకైనా మనస్సు మాకు లేదు. వన్న సంగతిని వున్నట్టుగా సత్యమే మేము చెప్పుదుము గాని లేనిది వున్నట్టుగా కల్పించి చెప్పడము మాలో లేదు. చూడండి వొకడు తెల్లనివాడుగా కనిపిస్తున్నప్పుడు కాదు యితడు నల్లని వాడని యెవరైనా చెప్పితే అది ఆక్షేపణగానున్ను, అబద్ధముగానున్ను వుంటుంది. అయితే వున్న ప్రకారము యితడు తెల్లనివాడేయని చెప్పినట్టయితే అది ఆక్షేపణయున్ను, దూషణయున్ను కాదుగదా - ఆలాగే మీ దైవములను గూర్చి మేము వున్నది వున్నట్టే చెప్పుదుము గాని వేరే చెప్పడములేదు.

మేము క్రీస్తుయొక్క సువార్త ప్రకటించే సమయముల యందు మీలో కొందరు వచ్చి మీ దైవములను గురించి యెత్తి మాతో మాట్లాడినప్పుడైనా లేక మేము దేవన్యాయము కనపర్చుటకు బోధించేటప్పుడైనా మీ దేవుండ్లను గురించి మీ గ్రంథముల యందు యేమివ్రాయబడి యున్నవో అవే యెత్తిచూపి చెప్పుతున్నాము గాని అంతకు మించి మరి యేమిన్ని మేము చెప్పలేదు.

ప్రియమైన మా దేశస్థులారా, మీ యిష్టదైవములను మేము ఆక్షేపిస్తున్నామని తలంచకండి. మరియేమంటే వున్నది వున్నట్టే చెప్పుదుము - అదియేలాగని మీరు అడుగుతారా - వినండి. మీలో అనేక దైవములు

కలవని మీ మతాచారముల చొప్పున మీరు వొప్పుకొంటున్నారు గదా. అందులో -

సూర్య-చంద్ర-ఇంద్ర-అగ్ని-యమ-
బ్రహ్మ-విష్ణు-శివ-గురు-బ్రాహ్మణులను

ముఖ్యులని పూజార్హులుగా యెంచి వారిని ఆరాధిస్తున్నారు. అయితే వీరిని దైవములని మీ గ్రంథకర్తలు చెప్పినప్పటికిన్ని వారేమళ్లీ ఆ గ్రంథములయందు వీరిని గూర్చిన ఆక్షేపణలున్ను వ్రాసి యుంచినారు. ఆ సంగతులు అత్యధికముగా కనపరుచుటకు మాకు అందుబడిలో వున్నప్పటికీ గ్రంథబాహుళ్య మవునని అన్నీ చెప్పక సంక్షేపముగా కొన్ని మాత్రము యెత్తి యీ దిగువను వ్రాసి మీకు రుజువులు యిస్తున్నాము. మరిన్ని వుడుకుతూవున్న కుండెడు కూటిలో నొక్కమెతుకు పట్టి చూచి తక్కిన యన్నమంతటిని గూర్చి యేలాగు తెలుసుకొందురో ఆలాగే బుద్ధిమంతులగు మీరందరున్ను మేము యీ దిగువను చూపబోయే సంక్షేపమైన రుజువువల్ల మీ గ్రంథములన్నిటిని గురించి తెలుసుకొనగలరని నిరీక్షిస్తున్నాము.

## మొదట సూర్యుని గురించి విచారింతము

మీలో అనేకులు సూర్యుని యొక దైవముగా భావించి ఆరాధిస్తున్నారు గదా - అయితే సూర్యుని పుట్టువును గురించిన్ని కొన్ని కార్యములను గురించిన్ని మీ గ్రంథముల యందు యెంత అవమాన కరముగా వ్రాసినారో చూడండి.

విష్ణు పురాణమందు 5వ ఆశ్వాసములో సూర్యుని పుట్టువును గురించి వ్రాసి యున్నదేమంటే -

గీతము:- అబ్జభవుని దక్షిణాంగుష్ఠమున దక్షు।
దవతరించె నతని కదితి పుట్టె।
నా సతీలలామ యందు కశ్యపునకు।
దివసకరుడు పుట్టి దేజరిల్లె॥

**దీని అర్థము:-** బ్రహ్మ కుడిపాదము యొక్క మొదటి వేలు యందు దక్షుడనేవాడు పుట్టెను. ఆ దక్షునికి కూతురైన యదితి యందు కశ్యపునివల్ల సూర్యుడు పుట్టినాడని చెప్పి వున్నది.

మనము వున్న ఈ భూగోళము కంటే పది లక్షల వంతులు యెక్కువ పరిమాణము గలిగి యింత గొప్పవేడిమిగా వున్న సూర్యుడు వొక స్త్రీ గర్భమునుంచి పుట్టునా - కాబట్టి తాతగారైన దక్షునియొక్క యున్ను అతనికి మనమడైన సూర్యునియొక్కయున్ను, పుట్టువులు యెంత విపరీతముగా వున్నవో చూడండి - యింతేకాదు మరియొక అసందర్భము మీ గ్రంథకర్తలు వ్రాసిరి. యేలాగంటే - ఆ సూర్యుడు వొక కాలమందు భూమికి దిగి వచ్చి పెండ్లిలేని కన్యకమైన కుంతి యను దానితో వ్యభిచరించెనని అందువల్ల కర్ణుడను కొడుకు ఆమెకు పుట్టెననిన్ని -

భారతాది పర్వములో 5వ ఆశ్వాసమున చెప్పియున్నది.

కందపద్యము:- అని కేలు మొగిచి మ్రొక్కిన -
వనజాతనేత్రకడకు వచ్చెను గగనం।
బున నుండి కమలమిత్రుడు।
తన తీవ్రకరత్వ ముడిపి తరుణద్యుతితోన్॥

ఈలాగున వ్రాసిరి గదా - సూర్యుడు భూమికి దిగి వచ్చునా। వచ్చియొక స్త్రీని పొందునా। యిది నిజమని బుద్ధిమంతులు నమ్ముదురా, మీరే విచారించండి.

ఇదిగాక చిత్రమైన మరియొక కల్పన చెప్పిరి. వింధ్యపర్వతము మత్సరించి ఆకాశముమట్టుకు యెదిగి సూర్యుని అడ్డుకొని పోనివ్వక అనేక సంవత్సరములు తన పక్కను నిలిపివేసెనని - యీ కథ - కాశీఖండమనే గ్రంథముయొక్క1వ ఆశ్వాసములో వున్నది - యేలాగునంటే -

**క॥ ఒక్కని మేషము రాహువు।**
**పుక్కిటిలో దగులు వడక పోయెడిభానుం ।**
**దక్కొండ ప్రక్కజిక్కెం ।**
**బెక్కేడులు విధి వశంబు పెంపెట్టిదయో ॥**

మరిన్ని భారతారణ్యపర్వమునందలి 3వ ఆశ్వాసములో వ్రాసియున్న విధము యేలాగంటే -

**క॥ ఇనశశి తారాతతులకు ।**
**జనరాకుండంగ బెరిగి జలధర పథమె ।**
**ల్లను గప్పియుండె వింధ్యం ।**
**బనుపమ ముత్తుంగమైసురాద్రిస్పర్థన్ ॥**

**క॥ రవిశశి గతులుడిగెను నిది ।**
**దివమిది రాత్రియని పసుమతీ జనులకు న ।**
**ద్దివిజముని వరుల కెరుగగ ।**
**నవగాధంబయ్యె నంధమయ్యె జగంబుల్ ॥**

చంద్ర । సూర్య । నక్షత్రములకంటే యెక్కువ పొడవుగా వొక కొండ ఆకాశమునకు యెదగడమా। ఆ కొండ పక్కను సూర్యుడు బహు సంవత్సరములు పడి యుండడమా। వోహెూ యీ మాటలు కొంచెమైనా నమ్ముటకు తగి యున్నవా - విచారించండి.

మరిన్ని సూర్యుడు వొక ఋషివల్లను తనకు నాశనము కలుగునని భయపడి ఆ మునిని శరణుజొచ్చినాడని వ్రాసియున్నది

భారతాను శాసనిక పర్వములో 3వ ఆశ్వాసమందు వ్రాసి యున్నది యేలాగంటే -

ఉ॥ దానినెరింగి భూసురత దాల్చి వెసంజను దెంచి యర్కుడ ।
మ్మానిత సంయమింగ నియమత్సర భావముదోప రోషము ।
న్మానుమునా వుదుంబలుకు మానుము నీవటుబాయుమే సదన్ ।
భానుని నేలగూలనని పల్కెము నీంద్రుడు శోణితాక్షుడై ॥

చ॥ అనినను శాంతి లేమికి భయంబెదగూరగ మ్రొక్కియాతడే ।
నినుడ సహింపునా వలన నెగ్గులు గల్గినయేని నీకునె ।
మ్మనముదయామయంబని సమస్త జగంబులు సంస్తుతింపగా
విని ముదమందుచున్ శరణు వేడెద గావుము నన్మునీశ్వరా ॥

ఈ పద్యముల మూలకథ యేమంటే - జమదగ్నియనే ఋషికి భార్యయైన రేణుకాదేవి వొకనాడు యెండలో పని సేయుచుండగా మధ్యాహ్నసూర్య కిరణములవల్ల ఆమె తలయున్ను పాదములన్ను పరితపించెను - అందునిమిత్తమై జమదగ్ని మహా కోపముతో నాయొక్క బాణాగ్ని చేత సూర్యుని నాశనము చేయుదునని యత్నపడగా సూర్యుడు భయపడి బ్రాహ్మణవేషముతో వచ్చి వినయోక్తులు పలికిన్ని అతని కోపము మాన్పించ లేక జమదగ్ని శరణు జొచ్చి తన్ను రక్షించుటకు వేడుకొనెనని వ్రాసియున్నది. అంతే కాకుండా ముందెన్నడూ లేని గొడుగున్ను పాదరక్షలున్ను తత్కాలమందే సూర్యుడు తన మనస్సులో పుట్టించి వాటిని ఆ మునికి యిచ్చి సంతోషపరిచెనని‌న్ని అది మొదలుకొని జనులంధరూ చెప్పులున్ను గొడుగులున్ను వాడిక చేసిరనిన్ని చెప్పి యున్నది.

చూడండి స్నేహితులారా - యీ ఆక్షేపణలు కలుగ చేసినవారు యెవరు? మేమా? లేక మీ గ్రంథకర్తలా? ఆలోచించండి.

## చంద్రుని గురించి విచారింతము

మీలో బహుజనులు పున్నమనాడున్ను, విదియనాడున్ను చంద్రుని ఆరాధిస్తున్నారు గదా - అయితే చంద్రుని పుట్టువును గురించిన్ని కొన్ని కార్యములను గురించిన్ని యెంత అవమానముగా మీ కవీశ్వరులు వ్రాసినారో చూడండి.

చంద్రుని పుట్టువును గురించి - విష్ణు పురాణమందలి 6వ ఆశ్వాసములో వ్రాసియున్న దేలాగంటే -

**క ॥ అత్రిమునీంద్రుని దక్షిణ ।**
**నేత్రంబున నుదయమయ్యె నిర్మల తేజో ।**
**గాత్రుడు సుధాకరుడు శత ।**
**పత్రజుని వరాంశమూని బంధురయశుడై ॥**

ఇంతకంటే విశేషముగా కాశీఖండమున 4గో ఆశ్వాసములో వ్రాసిన విధము యేలాగంటే -

**క ॥ త్రిసహస్రదివ్యవర్షము ।**
**లసదృశ గతినాచరించె నాతడు తపమున్ ।**
**విసుపూనకతని తేజో ।**
**రసపూరంబెగసె బ్రహ్మరంధ్రముదాకన్ ॥**

**సీ ॥ బ్రహ్మరంధ్రము మోవబారియయ్యిం**
**ద్రియద్రవ మోదిగిల్లె నేత్రములలోన ।**
**నేత్రగోళంబులు నిండంగ బర్వియా**
**వీర్యంబు కల ధౌత విమలకాంతి ।**

పదిధారలై పారె పది దిక్కులందున
నమరాపగా నిర్ఝరములువోలీ ।
ప్రవహించుచున్న యా పరమాధాతుర
సంబు ధరియించి చూలయ్యే దశదిశలును.
యెలమి తొమ్మిది నోలిగాష్ఠలు కఠోర ।
గర్భమైసూతిమాసంబు గదియుటయును ।
సర్వభారంబు భరియింప శక్తిలేక ।
వ్రాలె భూమండలంబుపై వణికివణికి ॥

**వ॥ ఆ దిగ్దేవతల గర్భంబుల నుద్భవిల్లిన తేజంబేకీభవించి చందురుండయ్యె ॥**

**ఈ పద్యముల తాత్పర్యము:** అత్రియను మునీంద్రుడు మూడువేల దివ్య సంవత్సరములు తపస్సు చేసెనని‌న్ని తప్పుడతని బీజము తలకెక్కి అది అతని కన్నులకు దిగి అక్కడినుంచి దిగజారి పదిధారలుగా ప్రవహించెనని‌న్ని ఆ ప్రవాహములను దిక్కులు భరించి గర్భిణులై ప్రసవించగా చంద్రుడు పుట్టెనని యింత అసహ్యాకరముగా చెప్పి యున్నది.

మరిన్ని పాలసముద్రమునుంచి చంద్రుడు పుట్టెనని భాగతాష్టమస్కంధములో వ్రాసియున్నది. చంద్రుని పుట్టువును గురించి ఈలాగు వ్రాసిన కల్పనలను బుద్ధి మంతులగువారు వొప్పుదురా.

ఇంతే కాదు, చంద్రుడు కళంకియని దూషించిరి. దాని గురించి కాశీఖండమనే గ్రంథములో 7వ ఆశ్వాసమందు వ్రాసియున్నది - యేలాగంటే.

**చ॥ వలపలికాల ముక్కునను వాతసుధారసముప్పతిల్లగా ।**
**వెలకిల వైచి తన్నెగణ వీరశిఖామణి వీరభద్రుడ ।**

**చ్చలమున రోహిణీరమణు చారు శరీరము తత్పదాహతిన్ ।**
**గలిగిన కందుగాదె పొడగానగ నయ్యెడు చిహ్నమైతగన్॥**

యీ పద్యము యొక్క తాత్పర్యము – దక్షుని యజ్ఞ కాలమందు వీరభద్రుడు చంద్రుని తన్నినాడనిన్ని ఆ తాపువల్ల చంద్రుని శరీరము కంది అది యొక చిహ్నముగా కనుపడుతూ వుండుననిన్ని చెప్పియున్నది.

ఇది గాక చంద్రుడు తనకు గురువైన బృహస్పతి భార్యయగు తారతో వ్యభిచరించెనని వ్రాసినారు. యిందుకు తారాశశాంక విజయమనే గ్రంథమే దృష్టాంతము. చూడండి.

ఈలాగున సూర్య చంద్రులను దైవములుగా యెంచి ఆరాధించవలెనని చెప్పిన్ని యిటువంటి ఆక్షేపణలున్ను వారి కొరకు వ్రాసిన వారు మీ గ్రంథకర్తలా లేక మేమా మీరే విచారించండి.

## ఇంద్రుని గురించి విచారింతము

ఇతడు స్వర్గమునకు అధికారియనియును యితని సెలవు చేత భూమి మీద వానలు కురుసుననియును యితడొక దైవమనియును మీలో అనేకులు ఇంద్రుని ఆరాధిస్తున్నారు. అయితే.యితని సంగతులు మిక్కిలి చెడ్డవిగా వున్నట్టుపూర్వికులే వ్రాసియుంచిరి అది చూడండి – ఇంద్రుడు గౌతమ ముని వల్ల శపించబడినాడని.

పద్మపురాణమునందలి 3వ ఆశ్వాసములో వ్రాసి యున్నది యేలాగంటే –

**ఉ॥ మిన్నక వచ్చివచ్చి పులిమీసల నుయ్యెల నూగినట్లు దా ।**
**నన్నొక చీరికింగొనక నాయిల్లు జొచ్చి భయంబు లేక ద ।**
**ర్పోన్నతి నిట్లు సేయు కలుషోగ్రమనస్కుని మేనురోతగా ।**
**గ్రన్నన బెక్కు యోనులుగ గావుతమంచు శపించెను గ్రతన్ ॥**

క॥ చీమును నెత్తురు దొరుగగ ।
పై ముసరెడి మక్షి కాలి బహుగతి దిరుగం ।
గా మహిమ దొరగెనింద్రుదు ।
సామాన్యమె యమ్మహాత్మ్మ శాపము తరుణీ ॥

క॥ అతిశయ రాజ్యమదంబున ।
మతికార్యాకార్య చింత మరచి పరస్త్రీ ।
రతిజేసి యింద్రుడిహపర
గతులకు నెడబాసె తనదు గర్వము పేర్మిన్ ॥

మూలకథ యేమంటే – వొకవాడు నారదముని ఇంద్రుని యొద్దికి వచ్చి గౌతముని భార్యయైన యహల్యయొక్క సౌందర్యము పొగడగా నింద్రుడు ఆమె యందు అసక్తి కలవాడై సమయము కనిపెట్టి ఆస్త్రీతో వ్యభిచరించినందున గౌతముడు మిక్కిలి కోపగించి మీద వ్రాసిన పద్యముల ప్రకారము యింద్రుని శరీరమంతా బహుగా అసహ్యాకరమైన యోనులు అయిపోయేటట్టు శపించెనని చెప్పియున్నది మరిన్ని యింద్రుడు – తన గురువు భార్యను అపహరించిన చంద్రునికి బుద్ధి చెప్పనంపినప్పుడు – చంద్రుడింద్రుని దోషములు యెత్తి హాస్యము చేసినట్లు –

విష్ణుపురాణమునందలి 6వ ఆశ్వాసములో వ్రాయబడియున్నది చూడండి.

ఉ ॥ కాయజుచేత గాసివడి గౌతమపత్నికి బోయి కొక్కొరో
కోయని కోడికూతలొాగి గూసి మునీంద్రుని చేత శప్తుడై ।
పోయిన వజ్రిమేటి దొరవోలె బృహస్పతి పత్నికైననున్ ।
రోయగనేల యింత తనరోతలు లోకమువారు నవ్వగన్ ॥

ఇంద్ర - చంద్రుల యొక్క పరస్పర తిరస్కార వాదభేదములు మీది పద్యమువల్ల యేలాగున కనిపిస్తున్నవో విచారించండి.

యిది కాక యింద్రుడు బ్రహ్మహత్య దోషము పొందినట్లు భాగవత షష్టమస్కంధములో వ్రాయబడి యున్నది - యేలాగునంటే వృత్రుడనునొక బ్రహ్మరాక్షసునికి ఇంద్రాది దేవతలు భయపడి విష్ణుని ప్రేరేపణవల్ల వారు దధీచియను ఋషియొద్దికి వెళ్లి ఆయన చచ్చేటట్టుగా కోరి ఆ ఋషియొక్క యెముకలు పుచ్చుకొని దేవతలందరు వాటిని ఆయుధములుగా చేసుకొనరనిన్ని యింద్రుడున్ను వొక యెముకను తనకు ఆయుధముగా చేసుకొని వృత్రాసురుని చంపగా అందువల్ల బ్రహ్మహత్య పాపము వచ్చెననిన్ని ఆ పాపము చండాలస్త్రీ రూపముతో నింద్రుని వెంటదగులగా అతడు పారిపోయి మానస సరస్సునందు నొక పద్మనాళములో చొచ్చిదానిదైనయొక నూలిలో అంటుకొని వెయ్యి సంవత్సరములు దాగి యుండెననిన్ని వ్రాసిరి.

మరియును ఆ కాలమందు నహుషుడనే యొక భూరాజు స్వర్గమునగల దేవతలందరిపైని అధికారిగా నిర్ణయించబడి యింద్రుని భార్యయైన శచీదేవిని తనకు భార్యగా చేసుకొనుటకు యత్న పడెననిన్ని ఆ సహుషుడు సప్తమహార్షులను తన సవారీ మోయుటకు బోయీలుగా నిర్ణయించి వారిచేత తనను మోయించుకొంటూ వుండగా ఆగస్త్యుడను ఋషి ఆనహుషుని శపించినందున వాడు భూమికి పోయి అజగరిమను పామై పుట్టెననిన్ని యీలాగున నొక కథ వ్రాసియుంచిరి -

అయితే నింద్రుని చరిత్రయందు బ్రహ్మహత్యపాప మింద్రుని యేలాగు వెంటాడెనో దాని విధము.

**భాగవత షష్టమస్కంధమందు దృష్టాంతము చూడండి -**

సీ॥ పాపంబు చండాల రూపంబు గలదాని
ముదిమిచే నొడలెల్ల గదలుదాని ।
క్షయకుష్ఠరోగ సంచయకృతంబగు దాని
నురురక్తపూరంబు దొరుగుదాని ।
నెరసిన వెం(ట్రుకల్ బెరసిన తలదాని
నటపోకు పోకుండుమనెడు దాని ।
గెదరు కంపున (బ్రేవుల దరజేసెడు
దాని తానెందు బారిన దరుముదాని ॥

నా గుణంబులెల్ల భోగింపకేరీతి ।
నరుగ నెంతవాడవనెడు దాని ।
బిట్టుతిరిగి జూచి భీతిల్లి సిగ్గుతో ।
దేవనాయకుండు దెరలి పరిచె ॥

దీని తాత్పర్యమేమంటే - క్షయ కుష్ఠరోగాదులనుంచి రక్త ప్రవాహములు కారుతూ పేగులు పెనుచుకొన చేసేటటువంటి గెదరు కంపుగలయొక వృద్ధ చండాల స్త్రీ లాగున పాపము వెంటదరిమి నప్పుడింద్రుడు భయము చేతనున్ను సిగ్గు చేతనున్ను పారిపోయెనట.

యిదియునుగాక నింద్రుని విషయమై యింకొక సంగతి చెప్పి చాలింతుము. అది యేమనగా!

కశ్యపుడనువాడు తనకు భార్యయైన దితి విషయమై సంతోషించి అతడు వరము నీకు యిస్తాను అడుగుమనగా ఆమె యింద్రుని చంపి ఆయన రాజ్యము యేలుటకు తగిన బలముగల యొక కుమారుడు తనకు పుట్టవలెనని అడిగెనట. అందుకతడు ఆ వరము ఆమెకు యిచ్చి శరీర శుద్ధియైన యొక వ్రతము తప్పకుండా నూరు సంవత్సరములు సేయుమని ఆమెను నియమించెను. ఆ సంగతి యింద్రునకు తెలిసి ఆమె

గర్భ పిండము చెడగొట్టుటకు ఇంద్రుడు తన సవతి తల్లియైన దితిని కపటముగా సేవించుటకు వచ్చి ఆమె గర్భమందున్న పిండము 49 ముక్కలుగా ఖండించినట్లు యీ దిగువ పద్యములవల్ల చూడవచ్చును.

**విష్ణుపురాణము 2వ ఆశ్వాసములో**

క॥ దేవేంద్రుడంతయును విని ।
దా వేడుక పుట్ట సవతి తల్లికి గడు మి ।
థ్యా వినయంబులు సేయుచు ।
సేవింపుచునుండె కపట శీలము మెరయన్ ॥

వ॥ ఇవ్విధంబునందొంబది తొమ్మిది సంవత్సరంబులు చనిన నొక్కనాడు పాదప్రక్షాళనంబు సేయమరిచి భోజనంబు చేసి వికీర్ణ శిరోజయై నిద్రింపుచున్న దితి గర్భంబునంబ్రవేశించి అర్భకుండు రోదనంబు సేయుచుండ నతండు మారోది మారోదియని యుపలాలించుచు వజ్రంబు చేత శరీరంబు సప్త ఖండంబులు చేసి యవి యన్నియు వెండియు నలుబది తొమ్మిది తునియలు చేసి యింద్రుడు బోయె ॥

యీ సంగతి విచారించినప్పుడు ఆ స్త్రీ అటువంటి వరము కోరడమున్ను కోరిన ప్రకారము ఆ పురుషుడు ఆ వరము యిచ్చుటకు వొప్పడమున్ను అన్యాయముగా వున్నది - మరిన్ని ఆ స్త్రీ తన కాళ్లు కడుగుకొనుట మరిచి భోజనము చేసి వీడిన కొప్పుతో నిద్రించినప్పుడు యింద్రుడు ఆమె గర్భములో చొరబడి గర్భస్థ శిశువును 49 ముక్కలుగా ఖండించెనని చెప్పడము మిక్కిలి యన్యాయముగా వున్నది.

అంతేగాక యింద్రుడు తన వజ్రాయుధముతో కూడా ఆ స్త్రీ గర్భములో చొరబడుటకున్ను శిశువును యిన్ని ముక్కలుగా నరుకుటకున్ను ఆమెకు యీ నొప్పి తెలియకుండా వుండుటకున్ను ఆమె గర్భము సముద్రమంత వుందునా - మీరే ఆలోచించండి యిటువంటి ఆక్షేపణలున్ను అనుచితములున్ను మీ గ్రంధములే చెప్పుతున్నప్పుడు మేము ఆక్షేపిస్తున్నా మని మీ రెవరయినా అనవచ్చునా.

## అగ్నిని గురించి విచారింతము

మీలో అనేకులు అగ్నిని దైవముగా యెంచి పూజ చేస్తూ వున్నారు - అయితే అగ్నిని గురించిన వృత్తాంతము మీ కవీశ్వరులు యేలాగున వ్రాసిరో చూడండి.

భారతాది పర్వము 8వ ఆశ్వాసములో అగ్నిని గురించి చెప్పిన కథ యేమంటే.

స్వేతకియనునొక రాజర్షి పన్నెండు సంవత్సరముల పర్యంతము అహోరాత్రులు యెడతెగకుండా పడుతూ వుండే నేతి ధార చేత అగ్నిని తృప్తిపరిచి నాడనియును అందువల్ల అగ్నికి మాంద్యమున్ను అజీర్ణత్వమున్ను గలిగి వ్యాధి పట్టుకొన్నందున ఆనొప్పి సహించలేక అగ్ని బ్రహ్మయొద్దికి వెళ్లి యౌషధము అడిగెననిన్ని అందుకు బ్రహ్మ అగ్నితో చెప్పిన వుపాయము యేదంటే -

**క॥ యీ వ్యాధి యొంట దీరుదు ।**
**దీవ్యౌషధయుక్తమైన దివిజవనంబున్ ।**
**హవ్యాశన భక్షింపు మ ।**
**హావ్యాధిశమంబు దాననగునీకనన్ ॥**

**తాత్పర్యము** - ఇంద్రుని యొక్క ఖాండవ వనము నీవు దహించినట్టయితే యీ మహా రోగము పోవును గాని మరి యొక విధమున పోదని అగ్నితో బ్రహ్మచెప్పెను.

ఆలాగున అగ్ని వెళ్లి ఖాండవవనము దహించబోతే ఇంద్రునివల్ల ఆటంకపరచబడి ద్వాపరయుగము పర్యంతము ఆ రోగముతో అగ్ని కష్టపడుతూ వుండెననిన్ని - తరువాత ధర్మరాజుకు తమ్ముడైన అర్జునుని సహాయమువల్ల ఆ వనము భక్షించి ఆ వ్యాధినుంచి స్వస్థత పొందెననిన్ని వ్రాసి యున్నది.

యిదిగాక భృగుమహాముని అగ్ని మీద కోపపడి నీవు సర్వ భక్షకుడవు గమ్మని అగ్నిని శపించినట్టు భారతాది పర్వము 2వ ఆశ్వాసములో వ్రాసియున్నది.

ఈ కల్పనా సంగతులను విచారించినప్పుడు బుద్ధిమంతులు నమ్మగలరా - ఈ ఆక్షేపణలున్ను యీ హాస్యకరమైన సంగతులున్ను మీ గ్రంథకర్తలే కల్పించిరి గాని మేము చేయలేదు గదా.

## యమధర్మరాజును గురించి విచారింతము

మనుష్యులు మరణమైన తరువాత యముడు వారి వారి పాపపుణ్యములు విమర్శించి తగిన ఫలములు యిచ్చేవాడని యెంచి అనేకులు యితడున్ను వొక దైవమని అతని నమ్ముతున్నారు - అయితే యముని గురించి -

భారతాది పర్వము 4వ ఆశ్వాసము తుదను వ్రాయబడి యున్న కథయేలాగంటే ।

ఒక రాజు మాండవ్యడనునొక ఋషిని శూలమున వేయించెను । యెందుకంటే ఆ రాజు యింటిలోకొందరు దొంగలు చొచ్చి సొమ్ము యెత్తుకొనిపోయి మాండవ్యుని యాశ్రమ వనమందు దొంగలు దాగియుండగా తలవర్లు వెళ్లి ఆ దొంగలను పట్టి ఆ ఋషిని కూడా వొక దొంగయని యెంచి రాజు యొద్దికి వారితో కూడా తెచ్చిరి - రాజు దొంగలను చంపి ఋషిని శూలమున వేయించెను.

ఆ ముని చావక విడుదల పొంది వొక నాడు యమపట్ట ణమునకు పోయి యమునితో నేను శూలమునపడేటట్టు చేసి యెందుకు యీలాగు నన్ను కష్టపెట్టితివని అడగగా - అందుకు యముడు చెప్పిన హేతువున్ను, మాండవ్యుడు యమునికి యిచ్చిన శాపమున్ను యీ దిగువ పద్యములవల్ల తెలియబడును.

క॥ సొలవక తూరీగల కొ ।
ఱ్రుల బెట్టితి వీవు నీ చిరుత కాలము ద ।
త్ఫలమిప్పుడను భవించితి ।
దొలగునే హింసాపరులకు దుఃఖ ప్రాప్తుల్ ॥

వ॥ అనిన విని మాండవ్యుండలిగి జన్మంబు మొదలుగా పంద్రెండు వత్సరంబులు బోవునంతకు పురుషుండు బాలుండుగాడే! వాడెద్ది చేసినం బాపంబులంబొరయడు వానికి నొరులెగ్గు చేసినంబాతకుల గుదురిదినా చేసిన మర్యాద. నీవిట్టి ధర్మంబు దలంపక బాల్యంబున నల్పదోషంబు జేసిన నాకు బ్రాహ్మణోచితం బుగాని క్రూరదండనంబున దండించినవాడవు గావున మర్త్యంబున శూద్రయోనింబుట్టుమని ధర్మరాజునకు శాపంబిచ్చుటం జేసి వాడు విదురుండై పుట్టె ॥

గీ॥ చండకోపుడైన మాండవ్యముని
వరుశాపమున జముండు సంభవించె ।
విదురుడనగ ధర్మవిదుడు పారాశర్యు ।
వీర్యమున నవార్య వీర్యబలుడు॥

**తాత్పర్యము:-** నీవు చిన్నప్పుడు తూరీగలను కొఱ్రుల బెట్టినావుగనుక ఆ ఫలము నీకు యివ్వబడెనని యముడు చెప్పగా మాండవ్యుడు కోపగించి - బాల్యకాలమున చేసిన దోషములు దోషములుగా యెంచబడవని చెప్పి యముని భూమిలో శూద్రయోని యందు పుట్టుమని శపించెను. అందువల్ల యముడు విదురుడై వ్యాసముని వీర్యముచేత పుట్టినాడని చెప్పియున్నది.

యీకథవిచారిస్తే యముడు విదురుడై పుట్ట వచ్చినప్పుడు అతని యుద్యోగమెవరు చేసిరి? అతని రాజ్యపరిపాలను యేమై పోయెను? యింతేకాదు యీ కల్పన యందు అబద్ధమున్ను అసందర్భమున్ను

కానవస్తున్నది. యేలాగంటే - పాండురాజు భార్యయైన కుంతీదేవి యొద్దికి యముడు వచ్చి రమించుటవల్ల ఆమెకు ధర్మరాజు పుట్టెనని భారతాది పర్వమందేచెప్పియున్నది గదా యముడైన విదురుడు ధర్మరాజుకు పినతండ్రియై మాండవ్యుని శాపమువల్ల మునుపే పుట్టియుండగా కుంతీ కుమారుడైన ధర్మరాజు పుట్టువునకు మరియే యముడు కారణుడాయెను - వొక దాని కొకటి కేవలము సరిపడక వున్నదే। చూడండి మా ప్రియ దేశస్థులారా యిటువంటి అసందర్భములైన ఆక్షేపణలు గల కథలు మీ గ్రంథకర్తలే వ్రాసి యుండగా మీలో కొందరు మా మీద సణుగుట యెందుకు?

## బ్రహ్మను గురించి విచారింతుము

లోకములను పుట్టించే వాడు బ్రహ్మయని అతని మీరు మిక్కిలీ గొప్పగా యెంచుతున్నారు. అయితే బ్రహ్మతనంతట తానే జ్ఞానహీనుడనని నారదమునితో తెలియచేసినట్టు -

భాగవత ద్వితీయ స్కంధములో వ్రాయబడి యున్నది.

శా॥ నానాస్థావర జంగమ ప్రకరముల్ నాయంత నిర్మింప వి।
జ్ఞానంబేమియు లేక తొట్రుపడగా నాకున్ సమస్తాను సం।
ధానారంభ విచక్షణత్వము మహెూదారంబుగా నిచ్చెమున్।
నేనా యీశ్వరునాజ్ఞ గాక జగముల్ నిర్మింప శక్తుండనే॥

ఉ॥ ఆ నలినాక్షునందనుడనయ్యు ప్రజాపతినయ్యు యోగ వి
ద్యానిపుణుండనయ్యును పదంపడి మజ్జనన ప్రకారమే
యేను నెరంగ నవ్విభుని యిద్ధమహత్వమెరుంగనేర్తునే
కానబడెన్ రమేశ పరికల్పిత విశ్వము కొంత కొంతయున్॥

యీ పద్యముల తాత్పర్యము విచారించగా - బ్రహ్మజ్ఞానము లేని వాడైనట్టున్ను శక్తిలేనివాడుగా నున్ను తన పుట్టువు విధము తానే యెరుగనివాడుగానున్ను తన్నుగురించి తానే చెప్పుకొనెను.

మరిన్ని బ్రహ్మ - అపసవ్యముగా సృష్టించిన విధమును గురించిన్ని తన కూతురినే మోహించినట్టున్ను భాగవత తృతీయ స్కంధములో వ్రాసి యున్నది యేలాగంటే -

సీ॥ అరవింద సంభవు నంగుష్ఠమున
దక్షుదూరువు వలనను నారదుండు
నాభి పులహుడు కర్ణముల బులస్త్యుండు
త్వక్కున భృగువు హస్తమున గ్రతువు
నాస్యంబు వలన నయ్యంగిరసుడు ప్రాణమున
వసిష్ఠుదుమనమున మరీచి।
కన్నుల నత్రియుగా బుత్రదశకంబు
గలిగెను వెండియు నలినగర్భు।
దక్షిణ స్తనము వలన ధర్మమొదవె।
వెన్నువలన నుదయమయ్యె విశ్వభయద।
మైన మృత్యువ ధర్మంబునంద గలిగె।
నాత్మకాముండు జననమునందె మరియు॥

సీ॥ భ్రూయుగళంబున క్రోధంబు నధరమునందు
లోభంబు నాస్యమున వాణి।
యును మేఢ్రమందు బయోధుల
పానంబునందు నఘాశ్రయుండైన నిఋతి।
లాలితచ్ఛాయ వలన దేవహూతి
విభుండు కర్ధముడన పుట్టిరంత
నబ్జజుడాత్మ దేహమున జనించిన
భారతి జూచి విభ్రాంతి బొరసి॥

పంచశరబాణ నిర్భిన్న భావుడగుచు ।
కూతురను పాపమునకు సంకోచపడక ।
గవయగోరిన జనకునిగని మరీచి
మొదలుగాగల యమ్మ్ముని ముఖ్యులెరిగి ।

ఈ పద్యములలో చెప్పబడి యున్న పుట్టువులు విచారించినప్పుడు యెంత విపరీతముగా వున్నవో చూడండి - కాలిలోనొకడు - కంటిలోనొకడు - తోలులో నొకడు - తొడలోనొకడు - బొడ్డులో నొకడు - చెవిలో నొకడు - చేతిలో నొకడు - ఈ విధముగా బ్రహ్మయొక్క యవయవములలో కొందరు కొడుకులున్ను వొక కూతురున్ను మరికొన్ని గుణములున్ను పుట్టినట్టు వ్రాసినారు.

మరిన్ని బ్రహ్మ మేఢ్రములో అనగా లింగస్థానములో సముద్రములు పుట్టినవని వ్రాసిరి - వోహెూ సిగ్గున్ను నగుబాటున్ను గల యిటువంటి కల్పనలు బుద్ధిమంతులు నమ్ముదురా!

యింతే కాదు యింకా బ్రహ్మ తన కూతురితో వర్తించినందుకు మరీచి మొదలైన తన కొడుకులే తననాక్షేపించినట్టు మీద చెప్పిన తృతీయ స్కంధములోనే వ్రాసయున్నది - యేలాగంటే -

ఉ॥ చాలునహెూ సరోజ భవసత్పథ వృత్తి దొరంగి కూతు ని ।
ట్లాలరివై రమింప హృదయంబున గోరుట ధర్మరీతి యే ।
బేలరివైతినీ తగవు పెద్దతనంబును మంటిపాలుగా ।
శీలము వోపదట్టెయిటు చేసినవారలుమున్ను గల్గిరే ॥

ఉ॥ నీవు మహానుభావుడవ నింద్య చరిత్రుడవిట్టి చోట రా।
జీవభవుండు దా విధి నాషేధములాత్మ నెరుంగడయ్యె నీ
భావభవప్రసూన శరబాధితుడై తన కూతుబొందె బో
వావి దలంప లేకనుచు వారక లోకులు పధ్విదిట్టరే ॥

కII పాపము దలపక నిమిషము ।
లోపల జెడు సౌఖ్యములకు లోనైతివి యిం ।
తే పోధారుణి కామాంధోపి
నపశ్యతి యనంగదొల్లియు వినమేII

ఈ పద్యములయొక్క తాత్పర్యము విచారించండి. సన్మార్గము విడిచి తగవు పెద్దరికములు మంటిపాలు చేసి లోకులు తిట్టేటట్టు కామాంధుడవై యిది పాపమని తలచక వావి విడిచి కూతురితో వర్తించుట నీకు న్యాయమా అని బ్రహ్మను యీలాగు నిందించిన వారు యెవరు అతని కొడుకులేగదా అతని అసహ్యించిరి.

మరియు నా తృతీయస్కంధములోనే వేరోక సంగతి జూడవచ్చును యేలాగునంటే -

వII మరియు జఘనంబు వలన వతిలోలుపులైన యసురలంబుట్టింప వారలతి కాముకులగుటం జేసి యయ్యజునించేరి మిథునకర్మం బపేక్షించిన విరించి నగుచు నిర్లజ్జులైన యసురలు దన వెంటనంటి దగులంబరిచి ప్రపన్నార్తి హరుండు భక్త జనానురూప సందర్శునుండైన నారాయణుంజేరి తత్పాదంబులకుం బ్రణమిల్లి యిట్లనియె II

గీ II ఈ ప్రజాసృష్టి కల్పనంబేనొనర్ప ।
నందు బాపాత్ములైన యీ యసురలిపుడు ।
ననురమింపంగ దాయవచ్చిన గలంగి ।
యిటకు వచ్చితి ననుగావు మిద్ధచరిత II

**తాత్పర్యమేమంటే** - బ్రహ్మ - తన తొడల వల్లనురాక్షసులను పుట్టించెనట - అట్టి రాక్షసులు కామాతురులై బ్రహ్మనే పట్టి రమించుటకు వెంటాడగా బ్రహ్మ పారిపోయి విష్ణుని శరణుజొచ్చెనని వ్రాసియున్నది - యోహా యిది మిక్కిలి సిగ్గునకును నగుబాటునకును ఆస్పదమైన వ్యర్థకథ

కాదా - మీరే చూడండి - యిటువంటి బ్రహ్మను సర్వప్రపంచ సృష్టికర్తయని యింకా మీరు నమ్ముదురేమో మీ చిత్తము -

మరియు నిటువంటి బ్రహ్మ వేదములు కల్పించి నాడనియును ఆ వేదములు మిక్కిలీ ప్రమాణములైన వనియును మీలో కొందరు అనుచున్నారు అయితే ఆ వేదములు యెవరివల్ల కల్పించబడెనో యా నిశ్చయము తెలియరాదు - అందును గురించి మిక్కిలీ గందరగోళముగా మీ గ్రంథములలో వ్రాసియున్నది - యేలాగనంటే -

కూర్మపురాణము 2వ ఆశ్వాసములో పార్వతి హిమవంతునితో చెప్పిన విధము -

**క॥ వేదములు నా స్వరూపము ।**
**లాదిని సర్గంబు లేక నబ్జజునకు స॥**
**మ్మోదమున నిచ్చితిని నత ।**
**డాదారిని కర్మకాండమం దొనరించెన్ ॥**

**అర్థము** - పార్వతివల్ల వేదములు కలిగినట్టున్ను అవి బ్రహ్మకు ఆమె యిచ్చినట్టున్ను చెప్పియున్నది ఇందుకు వ్యత్యాసముగా -

భాగవత ద్వితీయ స్కంధములో బ్రహ్మ నారదునితో చెప్పిన విధమేలాగంటే -

**చ॥ అనుఘచరిత్ర మన్మఖమునందు జనించె హయాసనాఖ్యతన్ ।**
**వినుత సువర్ణ వర్ణుడును వేదమయుండఖిలాంత రాత్మకుం**
**దను పమయజ్ఞపూరుషుడునై భగవంతుడు దత్సమస్త పా**
**వనమగు నాసికాశ్వసన వర్గమునందు దయించె వేదములే ॥**

అర్థము - బ్రహ్మ చెప్పినదేమంటే నేను చేసిన యజ్ఞములో గుర్రపు ముఖముగల భగవంతుడు పుట్టినాడు ఆయన ముక్కు రంధ్రముల గాలివల్ల వేదములు పుట్టెనని చెప్పియున్నది.

దీనికి వ్యత్యాసముగా భాగవతములోనే తృతీయస్కంధ మందు మైత్రేయుడు విదురునితో చెప్పిన విధము.

**చ॥ ఉడుగక పంకజాతభవుడొండొక దేహము దాల్చిధైర్యమున్ ।**
**విడువక సృష్టిపూర్వమున వే సృజియించిన నైపుణంబు దా ।**
**బొడమమి నాత్మతోన దలపోయుచునుండ జతుర్ముఖంబులన్ ।**
**వెడలె ననూన రూపముల వేదములంచిత ధర్మముక్తతన్ ॥**

అర్థము - బ్రహ్మ తాను సృష్టించే మొదటి క్రమము తోచకుండా మనస్సులో చింతిస్తూ వున్నప్పుడు అతని నాల్గు ముఖములనుంచి వేదములు బైలుదేరెనని చెప్పియున్నది.

ఈ వ్యత్యాసములవల్ల వేదములు యెవరివల్ల పుట్టెనో రూఢి తెలియదు. మెట్టుకు యెవరు కల్పించినా వేదములు కర్మములు చూపించేవేగాని జ్ఞానము తెలిపేవి కావని కొందరు వేదములను తోసివేసి వేదాంత శాస్త్రములు కల్పించినారు అయితే యీ వేదాంతమున్ను క్రమము తప్పియున్నదని కొందరాక్షేపించి వేదాంత వార్తిక సారసంగ్రహ నిష్కర్షయను ఇంకొక గ్రంథము సిద్ధము చేసి యున్నారు.

ఈలాగున నొక దాని నొకటి విరోధముగా కల్పించబడిన వేదాది గ్రంథములు మీలో విస్తారముగా వున్నవి - అయినందున మా ప్రియదేశస్థులారా బ్రహ్మనైనా వేదములనైనా మేము ఆక్షేపిస్తున్నామని మీరు యేలాగున అనగలరు - ఆ యాక్షేపకులు మీ వారేయని యీ పాటి రుజువు మీకు యిచ్చినాము.

# విష్ణుని గురించి విచారింతము

ఇతడు సకలదైవములలో గొప్ప దైవమని యెంచి మీలో చాలామంది యితని ఆరాధిస్తున్నారు - అయితే మీ గ్రంథముల యందు విచారించగా విష్ణునియందు కపటమున్ను అన్యాయమున్ను మిక్కిలి కానవస్తున్నవి గనుక అవి మీకు చూపింతుము.

పద్మపురాణము 6వ ఆశ్వాసములో శివుని పార్వతి యడిగిన ప్రశ్నయేదంటే -

**ఉత్సాహము॥ పొరి గపాల భస్మచర్మములును నెముక పేరులి।**
**ట్లరయనెల్ల శ్రుతులు నింద్యమనుచు జెప్పుచుండగా।**
**నెరుసు సేయకివి ధరింప నేమి కారణంబు నీ।**
**చరితమెల్ల జెప్పవయ్య చంద్రఖండ శేఖరా।**

అర్థము - పునుక బూడిదె తోలు యెముక పేరులు యివి నింద్యములని వేదముల యందు చెప్పుతుండగా వీటిని యెందుకు నీవు ధరించుకొనినావని పార్వతి శివుని అడిగెను.

అందుకు శివుడిచ్చిన ప్రత్యుత్తరమేమంటే -

**సీ॥ స్వాయంభు వాఖ్యమన్వంతరంబున**
**దొల్లినముచి పులోమదానవులు బాహు।**
**బలసమగ్రులు మహాబల పరి**
**వృతులును ధర్మచారిత్రులు దాత్తతేజు।**
**లఘువర్జితులును శుద్ధాంతరంగులు**
**వేదశాస్త్ర ప్రవీణులు సత్యరతులు।**
**తమశక్తి నఖిలలోకములును**
**సాధించి నాకంబుపై కేగి నాకవిభుని॥**

బారదోలిన నిర్జర ప్రభువుగూడి ।
నిఖిల దివిజులు దుగ్ధాంబు నిధికినేగి ।
పగరచేదారు వొందిన పరిభవంబు ।
లార్తిదోపంగ జెప్పిరి హరికినెలమి ॥

దీని ముఖ్యార్థము - నముచి మొదలైన పూర్వదేవతలగు రాక్షసులు శుద్ధహృదయులున్ను, సత్యవంతులున్ను, ధర్మచరిత్రులున్ను, పాపము విడిచిన వారున్ను, వేదశాస్త్ర ప్రవీణులునయి యుండి మిక్కిలి తమ పరాక్రమశక్తి చేత లోకములు గెలిచి యింద్రాది దేవతలను స్వర్గమునుంచి వెళ్లగొట్టిరి - అప్పుడింద్రాదులు విష్ణుని యొద్దికి పోయి తమ పాట్లు చెప్పుకొనిరని శివుడు చెప్పి -

ఆ సమయమున విష్ణుడు నన్ను పిలిచి నాతో అనినదేమంటే

**ఉ॥ సోమకళావంతంసనురనూదను లెంతయు ధర్మమార్గులై ।**
**వేమరు నిర్జరాదులకు వేకర మొంద జరించుచున్నవా ।**
**రేమియునైన వారి భ్రమియించి యవిద్యభజించియాత్మలన్**
**తామస మొందజేసి విదితంబుగలోకములుద్ధరింపనే ॥**

వ॥ నీవు పాషండ ధర్మాచరణంబు నంగీకరించి వారి మోహాత్ములంజేసి తామనపురాణ శాస్త్రంబులు పదేశింపుము । నీవు నుంగ పాలచర్మభస్మాస్థి చిహ్నితుండవై పాశుపతాస్త్రంబు గల్పించిమూడు లోకంబులు మోహింపంచేయము । కంకాళ పాషండ శైవమహాశైవాది భేదంబులుంగలిగి వేద బాహ్యంబులగు మతంబులు తామసులగు విప్రులవలంబించి భస్మధారులై ఆత్మ శాస్త్రంబులందు పరమవస్తువునిన్నెకా నిర్దేశింతురట్లగుటంజేసి రాక్షసులు తస్మతంబులం దగిలి మద్భక్తివిరహితులై నశింతురది గావునా ॥

వీటి ముఖ్యతాత్పర్యము ఓ శివుడా, రాక్షసులు ధర్మమార్గమందు వున్నారు గనుక వారు తామస వృత్తి నవలంచించి చెడేటట్టుగా వారిని భ్రమియించి నీవు కేవల పాషండమతము కల్పించి తామసపురాణ శాస్త్రములు బోధించి వారిని మోహితులను చేయుము రాక్షసులు ఆ మతమునువెంబడించుటవల్ల నశింతురని విష్ణుదు చెప్పినందున నేను వొప్పుకొని వునుకలు - బూడిదె - తోలు యెముకల పేరులు ధరించుకొంటిని.

**ఉ॥ ఈ గతినున్న నన్ను గని యెంతయువేడుక దైత్యదానవుల్ ।**
**రాగరసాబ్ధి దేలి చతురంబగుచున్న మదీయ వాక్య లీ ।**
**లాగతి తామసాతి గుణలాలసులై హరిపాద సేవనో ।**
**ద్యోగము వేదశాస్త్ర నిగమోక్తుల ధర్మము దప్పిరందరున్॥**

వ॥ ఇవ్విధంబున విషయాసక్తులును కామక్రోధాది గుణ సమన్వితులును సాత్వికహీనులును నిర్వీర్యులునై దేవ గణంబులకోటు పడి పంచత్వంబు నొందిరట్లుగావున ॥

వీటి ముఖ్యార్థమేమంటే - యీలాగునుండెడినన్ను జూచి నా వాక్యములకు లోబడి రాక్షసులు ధర్మము తప్పిపోయి కామక్రోధాది దుర్గుణముల యందు తగులుబడి పరాక్రమము చెడి దేవతలకు వీగి తుదకు చనిపోయిరని పార్వతి యడిగిన ప్రశ్నకు శివుదు యీలాగు చెప్పెనని వ్రాసియున్నది.

ప్రియమైన మా దేశస్థులారా, యీ కథను పట్టి మనము విచారించినప్పుడు - సముచి మొదలగు ఆ రాక్షసులు పరిశుద్ధ నీతి ధర్మ సత్యముల యందు ప్రవర్తించి పాపము లేనివారై యుండిరని మీద వ్రాసిన సీసపద్యములో చెప్పియుండగా అటువంటి మంచి వారిని పాపములో చొరబెట్టి నశింపచేయుటకు అంత చెడ్డదైన పాషండ మతము శివుని చేత కల్పింప చేయుట యిది విష్ణునికి తగునా - యిది మిక్కిలి యన్యాయము కాదా -

అయితే ఇంద్రాది దేవతలకు మేలు చేయుటకై విష్ణుడు యీలాగు చేయవలసియుండెనని మీరు చెప్పేపక్షమందు ఆ రాక్షసులకంటే ఇంద్రుడు మంచి వాడా - ఇంద్రుడు పాపము చేసి యెంత గొప్ప శిక్షబొందెనో ఆ సంగతి మునుపే రుజువు పర్చితిమి - యికను మిగిలిన దేవతలలో వేశ్యాత్వములున్ను, జారత్వములున్ను, మునుల తపస్సులు చెరుపుట మొదలైన బహు దుర్మార్గతలు కలిగి యున్నవనుటకు భాగవతాది పురాణములే సాక్ష్యమిస్తున్నవి. కాగా పాపములు చేసిన యింద్రాదులకు మేలు చేసి వారిని కాపాడుటయున్ను సద్ధర్మశీలురైన నముచి మొదలగు వారికి కీడు చేసి వారిని నశింప చేయుటయున్ను విష్ణునికి యేమి న్యాయము? యిందువల్ల అతనికి యేమైనా ఘనత్వము వచ్చునా? రాదు. మరిన్ని యీ యుభయ పక్షముల వారు - దితి - అదితి - యను సవతి తల్లుల బిడ్డలై యుండిరి. రాజ ధర్మము దేత వొకరితో నొకరు పోరాడి జయాపజయములు పొంది యున్నప్పుడు ధర్మముగా వుండే వారిని కపటయత్నము చేసి చెరపడమున్ను అధర్మముగా నడిచేవారిని పక్షపాతియై నిలువబెట్టడమున్ను విష్ణుని యందు యెంత గొప్ప అన్యాయమై యున్నదో యీ కథ మీరే ఆలోచించండి.

యింతేకాదు మరిన్ని విష్ణుడు బుద్ధావతారమెత్తెనని మీ పురాణముల యందు వ్రాసియున్నది గదా ఆ యవతారములో విష్ణుడు జరిగించే అన్యాయము మరీ యెంత పెద్దదో చూడండి.

త్రిపుర దానవులైన తారకాక్ష। కమలాక్ష। విద్యున్మాలి యనువారు ముందు చెప్పిన నముచి మొదలైన వారి వలెనే ధర్మపరాయణులై యుండిరి. వారి స్త్రీలున్ను, ప్రతివ్రతలై యుంగా విష్ణుడు బుద్ధరూపముతో అక్కడికి వెళ్లి వారికి దుర్భోధలను చేసి వేదాచారములున్ను జ్ఞాన సత్కార్యములున్ను పాడు చేసెనని -

దశావతార చరిత్రయందు 6వ ఆశ్వాసములో వ్రాసియున్నది. యేలాగంటే -

సీ॥ కర్మంబు ఫలదాత గాదీశ్వరుడెయంచు
ద్వివిధమై మీమాంస విఫలమయ్యె ।
నొక్క జీవుండంచు పెక్కు జీవులటంచు
వేదాంత శాస్త్రంబు వితథమయ్యె ।
హరియొక్క దంచును హరుడొక్కడంచును
బహు పురాణంబులు పాటిదప్పె ।
నైక్యవిధంబులే దరయగా స్మృతుల
నేతెరగునదీసిన తియ్యవచ్చు ।

దానము లొసంగ ద్విజులునుదగ్రనరక ।
కూపముల బాయుదురె మేలుగోరి తమకు
బుద్ధి హీనులు ప్రతిమల పూజసేతు ।
రనగ నెందున వినమెప్రజ్ఞాఢ్యులార ॥

అప్పుగొనియైన దొంగిలియైన లెస్స ।
జిహ్వాకింపైన దాని భుజింపవలయు ।
కంటి కింపైన కాంతల గలయవలయు ।
బ్రతుకు దినముల మోక్షంబు వెతుకనేల ॥

సీ॥ సురద్రావుచుండు మీగురుడు భార్గవ
మౌని పాలుడే నరక కూపమున మునిగె ।
చలపట్టి యధ్వరాశ్వముల దొంగిలి
పోవువాసవుండే రౌరవమున గూలె ।

13

నేకర్మములు లేక నిచ్చగా విహరించు
సనకాదు లెట్టియాతనల బడిరి ।
బలవంతమున గురుకుల కాంత
బట్టిన వనజారి యే దోషమనుభవించె ।

భళిర వారికి లేని పాపములు మనకె ।
గలిగెనే తను ముక్తిని గదయటన్న ।
కాయమెడలిన మోక్షంబెగాక మరి శ
రీరమేడది సుకృత దుష్కృతములేవి॥

యీ పద్యముల యర్థమేమంటే - వేదశాస్త్ర పురాణములు వ్యర్థములు. దానధర్మములు వట్టివి, విగ్రహపూజ బుద్ధిహీనత, అప్పు చేసియైన దొంగిలియైనా జిహ్వాకోరినది తినవచ్చును. పర స్త్రీలను పొందవచ్చును. బ్రతికే దినములలో మోక్షము వెతకడము యెందుకు. దేహము పోగానే ఆవల మోక్షమే గాక మరి పాప పుణ్యములు లేవు.

చూడండి మీ గురువైన శుక్రుడున్ను, ఇంద్రుడున్ను, చంద్రుడున్ను, సనకాది మునులున్ను, చెడ్డక్రియలు చేసినారు కారా? వారు నరకములో పడి రాలేదు. వారికి లేని పాపములు మనకే గలుగునా. కాబట్టి మనస్సుకు నచ్చినది అంతా చెయ్యవచ్చునని వారికి దుర్బోధలు చేసి వారిని చెరిపెను. మరిన్ని ఆ రాక్షసులను చెరపడమే కాకుండా పతివ్రతలైన వారి స్త్రీలనున్ను వొక రావిచెట్టును కౌంగిలించుకొండని బోధించి తాను అందులో వుండి వారిని భ్రష్టల చేసి వారి పతివ్రతా ధర్మము పాడు చేసెను. యిందు నిమిత్తము ఆ స్త్రీలు విష్ణుని శపించిరని వ్రాసియున్నది.

వొకరి ధర్మములు పడగొట్టి వారికి పాపము నేర్పడమున్ను, తానుకూడా పాపము చెయ్యడమున్ను విష్ణుని యందు యేలాగు కనిపిస్తున్నవో చూడండి.

మరిన్ని యీలాగే విష్ణుడు వామనుడై బలిచక్రవర్తిని యేలాగు మోసపుచ్చెను. సత్యము తప్పని ఆ మంచి రాజును వంచన చేసి బంధించి పాతాళ లోకమునకు పంపినందున యీ దోషము కొరకై విష్ణుడు రాముడై పుట్టినప్పుడు దాని ఫలము అనుభవించెనని రామాయణ యుద్ధకాండములో వ్రాసియున్నది - యేలాగంటే -

**క॥ ఇలనొరిగెనట్లు భుజగం ।**
**బులు బెనగొన రాముదాది పురుషుండయ్యున్ ।**
**బలిమును బంధించి యా ।**
**ఫలమిమ్మెయి గుడువకేలబాయు ననంగన్ ॥**

బలిచక్రవర్తిని అకారణముగా కట్టించిన పూర్వదోషమువల్ల విష్ణుడు రాముడైనప్పుడు ఇంద్రజిత్తుని నాగాస్త్రముచేత కట్టబడెనని చెప్పి యున్నది.

మరిన్ని రాముని చరిత్ర చూడండి. అతడు తన భార్యా వియోగకాలమందు యేలాగున యేడ్చెనో తన పక్షముగా సీతను విడిపించుటకు రావణునితో పోరాడి పడియున్న జటాయువను పక్షిని యజ్ఞానము చేత చంపుటకు యేలాగు యత్నపడెనో వాలిని పొంచి కొట్టి తారవల్ల యేలాటి శాపము పొందెనో చూడండి.

రామాయణ కిస్కింధాకాండములో చెప్పి యున్నది యేలాగంటే -

**క॥ పోలపతివ్రత గావున**
**నీలో బొలియన్ శపింప నేనోపుదుని ।**
**ట్లాలింగొల్పడివగలం ।**
**గ్రాలెడి నినువేరే యేల గణగిశ సింపన్ ॥**

చ॥ నరవర యిట్ల కారణము నా పతిజంపితి గాన నీవుబం ।
ధుర భుజశక్తితో మహిజదోడ్కొని వచ్చిన నామె నీకడన్ ।
జిరతరకాలమింపుగ వసింపక నీవతి దుఃఖ్కపాటుతో ।
నెరియుచునుండ భూమి సొరనిమ్మనుచున్‌శపియించె గిన్కతోన్ ।

తాత్పర్యము - నేను పతివ్రతను గనుక యిప్పుడే నీవు చచ్చేట్టు శపించ గలను గాని భార్యనుగోలుపోయి దుఃఖముచేత గ్రాలుతూ వున్న నిన్ను యెందుకు శపించవలెను. రాముడా - నా పెనిమిటిని నిష్కారణముగా జంపితివని గనుక సీతను నీవు తెచ్చినప్పటికీ చిరకారలము ఆమె నీ యొద్దను వుండక నీవు అతి దుఃఖగ్రస్తుడవై యుండేటట్టు ఆమె భూమిలో చొరబడి పోవును గాకని - తార. యీలాగు శపించెను.

తన తమ్ముడైన లక్ష్మణుడు రావణుని శక్తి బాణము వల్ల పడిపోయినప్పుడు రాముడు యేమిన్ని చేయలేక యేడ్చుచుండెను అని రామాయణ యుద్ధకాండములో వ్రాసియున్నది యలాగంటే -

క॥ నగరాజధీర లక్ష్మణ ।
విగతస్నే హుండవై వివేకింపకనన్ ।
దిగనాడి నీకు బోవగ ।
తగునే నాకేదిక్కు తమ్ముడచెపుమా ॥

క॥ రూపింపనెల్ల వారికి ।
నేపారగ ప్రొద్దు బొడుచునే సమయమునన్ ।
నాపాలి ప్రొద్దు గ్రుంకెను ।
పాపపుదుఃఖాబ్ధి లోనబడ పాలైతిన్

క॥ నీ రాక కెదురుచూచు చ ।
హొరాత్రులు నగలబొగులు చందుసుమిత్రన్ ।
జేరియడుగ నేమందుని ।
కేరీతి మొగంబు జూతునెక్కడజొత్తున్ ॥

**గీ॥ అన్నదిగనాడి నను శరణన్న నేను ।**
**లంక పట్టముగట్టెద శంకమాను ।**
**మని విభీషణు బలికితి నదియుదప్పె ।**
**నిల నభాగ్యుల కెందును గలదె పెంపు ॥**

సాధారణ నరులలో పామరుని వలెను రాముడు యింతగా యేడ్చినట్టు వ్రాసిరి. అయితే ఆ సమయమందు ఔషధములు వున్న కొండను హనుమంతుడు తెస్తూ వుండగా రాముడు **అజ్ఞానము చేత** ఆ కొండనుచూచి సూర్యోదయమని తలచి లేచి సూర్యుని పడగొట్టి వేతునని ధనుర్బాణములు పుచ్చుకొనగా అప్పుడు జాంబవంతుడు సుగ్రీవ విభీషణులు రామునికి బుద్ధి చెప్పిరని -

రామాయణ యుద్ధకాండములో వ్రాసియున్నది యేలాగంటే

**క॥ వరదివ్యౌషధలతికా ।**
**స్ఫురితంబగు ద్రోణశిఖరి భుజబల మెసగన్ ।**
**కరువలితనయుడు దెచ్చెను ।**
**సరసిజ మిత్రుండుగాడు సౌజన్యనిధీ ॥**

**అర్థము** - ఔషధలతలతో కూడుకున్న ద్రోణగిరిని హనుమంతుడు తెచ్చెను గాని అది సూర్యోదయము కాదని బుద్ధి చెప్పిరి. రాముని యీ సంగతులు విచారించినప్పుడు శక్తి జ్ఞాన వివేకములు రామావతారమందు బొత్తిగా లేకపోవడము తేటగా కానవస్తున్నది.

మరిన్ని విష్ణుడు పరశురామావతారము యెత్తెనని చెప్పుతున్నారు గదా - ఆ యవతారము యే కార్యములు జరిగించెనో చూడండి.

భారతాది పర్వము 1వ ఆశ్వాసములో వ్రాసి యున్నది యేలాగంటే -

శా॥ త్రేతాద్వాపర సంధినుద్ధత మదాంధీ భూతవిద్వేషిజి ।
మూతో గ్రశ్వసనుండు రాముదలుకన్ ముయ్యేడు మారుల్రణ।
ప్రీతిన్ వైరిధరాత లేశ్వరుల జంపెన్ బల్పురందీర్ఘని ।
ర్ఘాత క్రూరకుఠారలూన నిఖిలక్షత్రోరు కాంతారుడై ॥

వ॥ అప్పరశురాముండు నిజ నిసిత కుఠారధారావదలిత సకలక్షత్ర రుధిరాపూర్ణంబులుగా నేను మడుగులు గావించి తద్రుధిరజలంబులంబి తృతర్పణంబు చేసి తత్పతృగణ ప్రార్థనను పశమిత క్రోధుండయ్యె దానంచేసి తత్సమీప ప్రదేశంబు శమంత పంచకం బనంబరగె ॥

**తాత్పర్యము :** త్రేతా ద్వాపర యుగముల సంధిని పరశురాముడు యిరువదియొక్క మారు తనకు ఆయుధమైన గొడ్డటితో సకల రాజులను జంపి వారి రక్తము అయిదు మడుగులు నిండేటట్టు చేసి ఆ రక్తజలముతో పితృతర్పణము చేసి తనకోపము చల్లార్చినాడనిన్ని ఆస్థలమునకు శమంత పంచకమను పేరు వచ్చెనినిన్ని చెప్పియున్నది.

మరిన్ని భారతారణ్య పర్వము 2వ ఆశ్వాసము లో వ్రాసియున్న విధము యేలాగంటే -

క॥ వీరుడయి క్షత్రియుల దన ।
దారుణ పరశువున జామదగ్న్యుడు రౌద్రా ।
కారుడు వధియించి తదీ ।
యరుణమున నేను మడుగు లాపాదించెన్ ॥

వ॥ అందు బితృతర్పణంబు చేసినంబితృ దేవతలాతనికి బ్రత్యక్షంబయి నీ కిష్టంబైన వరంబు వేడు మనినం బరశురాముండు వారలకిట్టనియె ॥

గీ॥ క్షత్రవధనైన పాపంబు గ్రాగవలయు ।
గడగినాకును సద్గతి గలుగవలయు ।
నివియు బుణ్యతీర్థంబులై యిద్ధరిత్రి ।
బరగు చుండంగవలయు మీ కరుణజేసి ॥

తాత్పర్యమేమంటే - పరశురాముడు తన గొడ్డటితో చంపిన రాజుల రక్తము మడువులు గావించి పితృతర్పణము సేయగా పితృలు ప్రత్యక్షమయి వరమడుగుమనిరి. అందుకు పరశురాముడు నిష్కారణముగా రాజులను చంపినందువల్ల వచ్చిన పాపము హరించి పోయి తనకు సద్గతి దొరకవలెననిన్ని ఆ రక్తపు మడువులు పుణ్య తీర్థములై యుండవలెననిన్ని వరములడిగి కొనెనని చెప్పి యున్నది.

చూడండి - కార్తవీర్యార్జునుని కుమాళ్లు యీ పరశురాముని తండ్రియైన జమదగ్నిని చంపినందున యితడు ఆ రాజునున్ను ఆ రాజు కుమారులనున్ను చంపడమే కాకుండా మిక్కిలి వెఱ్రికోపము తెచ్చుకొని తన యెడల నిర్దోషులైన భూరాజులనందరినిన్ని యిరువది యొక మారు వెతికి చంపి వారి రక్తము అయిదు మడువులు అయేటట్టు పారించెనట - అట్టి క్రూర కర్మమువల్ల పాపము తనకు సంభవిచినందున దాని పరిహారమున్ను తనకు సద్గతియున్ను దొరకవలెనని తనకు ముందుగా చనిపోయిన తన పితరులను ప్రార్థించెనట - యితడు అవతార పురుషుడా? మీరే ఆలోచించండి.

మరిన్ని విష్ణుడు బలరామ కృష్ణావతారములు యెత్తినాడని చెప్పుదురు గదా వారియందు తగిన లక్షణములు వున్నవేమో శోధించండి.

కృష్ణుని గుణములు మీలో కొందరు కృష్ణలీలలని పాడుతూ వుండగా స్త్రీలున్ను, పురుషులన్ను కూడి వింటున్నారుగదా అవి వినడమువల్ల వెఱ్రి వికారమైన మోహభ్రాంతులచేత మనస్సులు చెడిపోవునా లేక భక్తిజ్ఞాన వైరాగ్యములు పుట్టునా మీరే ఆలోచించండి.

మరిన్ని కృష్ణుడు అస్ఖలిత బ్రహ్మచారి అని మీలో కొందరు అంటున్నారు ఆలాగు అయన వల్లకాదు యెందుకంటే అతడు స్ఖలితుడున్ను సంసారులందరిలో పెద్ద సంసారిన్ని అయి వున్నట్టుగా -

భాగవత దశమస్కంధోత్తరభాగములో వ్రాసియున్నది యేలాగంటే -

చ॥ అనఘపదారు వేల సతులందు జనించిరి వేరు వేరనం।
దన దశకంబు తత్సుతవితానముగాంచి రనేకసూనులం।
నెనయగనిట్లు పిల్ల చెరుకీనినకై వడి పుత్రపౌత్ర వ।
ర్ధనముననొప్పె గృష్ణుడు ముదంబున తామర తంపరై భువిన్॥

గీ॥ గురు జనంబుల తొమ్మిది కోట్ల మీద।
నెనబ దెనిమిది వేల పై నెసగనూర్గు।
రన్నతద్బాలకావళీ నెన్నదరమె।
శూలికైనను తామర చూలికైన॥

ఈ పద్యముల అర్ధము - పదియారువేల స్త్రీల యందు వొక్కొక తెకు పదుగురు కొడుకులు కృష్ణుని వల్ల పుట్టిరనిన్ని యా కొడుకులకు యింకా అనేక కుమారవర్గముపుట్టి పిల్లచెరుకు యీనినట్లు తామరతంపరై పుత్రపౌత్రులతో కృష్ణుడు వర్ధిల్లెననిన్ని ఆ పిల్లలకు విద్యనేర్పే గురువులే 90088100 గురు అనిన్ని చెప్పియున్నది - ఈలాగు కృష్ణుడు గొప్ప సంసారియని వుండగా అస్ఖలితుడని చెప్పడము యుక్తము కాదే.

మరిన్ని శమంతకము అనే వొకమణిని ధరించుకోవడమునకు తానున్ను తనవారున్ను యెంతమాత్రము యోగ్యతలేని వారై యున్నట్లు కృష్ణుడే పలికెనని -

విష్ణు పురాణము 6వ ఆశ్వాసములో వ్రాసియున్నది యేలాగంటే -

క॥ సతతంబు బ్రహ్మచర్య।
వ్రతస్థులకుగాక యున్న వారలకును సం
గతిగా దీమణిదాల్పగ।
నతిశయదుఃఖంబు ప్రాణహానియు జేయున్॥

సీ॥ షోడశ సాహస్ర సుందరీ జన
మోహితుడగాన సేనోపుదునె ధరింప।
నామీదకూర్మియెన్నడు బాయదటుగాన
సత్యభామకు బూన్పశక్తి లేదు
ప్రతిదినంబును మద్యపానంబుగా
వించు బలభద్రునకు భరింపంగ రాదు
సతులతో గూడి సంసారముల్ జేసిన
వారెవ్వరును దాల్పలేరు భూమి॥

గానవాకునుజూడనిష్కల్మషుండు।
బ్రహ్మచర్యవ్రతస్థుండు పరమ భాగ।
వతుడు సంతత యజ్ఞదీక్షితుడునైన।
యట్టి యక్రూరునకు నిధియర్హమగును.

ఈ పద్యముల తాత్పర్యము చూస్తే కృష్ణ బలరాముల కంటే - అక్రూరుడనే వాడే అధికూడాయెనుగదా। హిందూ జనులు వానిని యేల పూజింపరు - వొక మణిని ధరించుకొనుటకు తగనని చెప్పే కృష్ణుని దైవమని మీరు ఆరాధించుటకు తగి యున్నాడా మీరే ఆలోచించండి.

మరిన్ని కృష్ణ బలభద్రులకు జరిగిన కలహము యెట్టిదో చూడండి బలరాముడు కృష్ణుని మీద కోపగించెనట - యెందుకంటే శతధన్వుడనే వానిని కృష్ణుడు చంపి శమంతకమణి వాని యొద్ద కానక తిరిగీ వచ్చినప్పుడు ఆ మణి కృష్ణుడు దొంగిలెననిన్ని అది తనకు యివ్వబడుతుందని యామణి దొరకలేనట్టు కృష్ణుడు తనతో అబద్ధమాడెననిన్ని బలరాముడు యీలాగు తలంచి కోపిగించి పగచేసినాడని.

విష్ణుపురాణము 6వ ఆశ్వాసములో వ్రాసియున్నది. యేలాగంటే -

కII తమ్ముడవని నిన్నేగతి
నమ్మంగానెట్లువచ్చునా కొసగక ర
త్నమ్మట మటించుకొంటివి
పొమ్మా నీతోడి పొందుపొరపొచ్చమగున్ II

చII అనుటయు పద్మనాభుడు హలాయుదుగన్గొనియేను నీకు వం
చన మొనరించి దివ్యమణిచౌర్యము సేయుట లేదు నమ్మునీ మనమున
శంక గల్గిన బ్రమాణము నిచ్చెద నీవు గోరినన్ వనరు హమిత్రుచేత
గొనివచ్చెద నవ్విభు కంఠమాలికన్.

మII అని యిట్లెన్ని విధంబులన్ బలికినన్హాలా మదోద్వేగ లో
చన ఘూర్ణకృతుడై హలంబురుబుజా స్తంభంబుపైనిల్పికో
పని గూఢోక్తులు కృష్ణునింబలికి నీ బంధుత్వమున్ ద్వారకా
జనసాంగత్యము నొల్ల నేనికయథేచ్ఛావృత్తిమై బోయెదన్

ఈలాగు పలికి బలరాముడు వెళ్లిపోయి మిథిలా పట్టణములో మూడు సంవత్సరములు వుండెనని వ్రాసియున్నది. ఓహో యింత అజ్ఞానమున్ను యింత తాగుబోతు తనమున్ను, యింత మూర్ఖత్వమున్ను బలరాముడని చెప్పే అవతారపురుషుని యందు యేలాగు కానవస్తున్నదో మీది పద్యములవల్ల మీరే ఆలోచించండి.

మరిన్ని కృష్ణుడు తాను అబద్ధికుడు సరేకదా పాండవులను కూడా ద్రోణాచార్యునితో అబద్ధము చెప్పుమని ప్రేరేపించినట్టు.

భారత ద్రోణపర్వములో 5 వ ఆశ్వాసములో వ్రాసియున్నది యేలాగంటే –

చII అని మొనదేవ దానవుల కై ననుగెల్వన శక్యమిమ్మహా
త్మునినొకమందు చెప్పెద సుతుండిపు డిల్గెనటంచు విన్నయం
తనెయతడా యుధంబు దిగనాడి విచేష్టత బొందునప్పుడా
తని బరిమార్ప వచ్చునిది దప్పనుపాయముగల్గ దెమ్మెయిన్.

వ॥ కావున నశ్వత్థామ జచ్చెనని యొక్క రుండి తనికి చెప్పుద కర్జంబనినవిని యచ్చుటంగొందరిది మేలనిరి యర్జునుండు దాని కొడంబడక యుండె పాండ వాగ్రజుండు విషాదంబుతో విచారించె తదనంతరంబా ॥

అర్ధమేమంటే - అశ్వత్థామ చచ్చినాడని ద్రోణాచార్యునితో వొకడు అబద్ధము చెప్పినట్టయితే కొడుకుచనిపోవుట వినినంతనేఅతడు ఆయుధము విడిచి నిశ్చేష్టుడై యుండును గనుక అప్పుడతని చంపవచ్చును యిదే మందు అని కృష్ణుడు చెప్పెను - అందుకు అర్జునుడున్ను ధర్మరాజున్ను వొప్పక పోయిరి. మరిన్ని కృష్ణుడు ధర్మరాజుతో అనేమాటలు.

**క॥ మమునీతని కొప్పంపక**
**సముచితముగ గాచుకొనుమసత్యవచనదో**
**షము లేదు ప్రాణ రక్షణ ।**
**సమయంబున నితని కొడుకు నచ్చెననుమికన్ ॥**

ఈ దుర్భోధవిని ధర్మరాజు అబద్ధమాడెను యేలాగంటే.

**గీ॥ వలయు కొలది నెలుంగెత్తి వర్ణ సమితి**
**యచ్చుపడగ నశ్వత్థామ చచ్చెననియె**
**నని పందంపడి యెల్లన నతని చెవికి**
**తెలియకుండ కుంజరమని పలికెనధిప ॥**

ఈలాగున అబద్ధమాడెను - తరువాత యీ పాపము కొరకు ధర్మరాజు పశ్చాత్తాపము పొందినట్టు.

భారత శాంతిపర్వము 1వ ఆశ్వాసములో వ్రాసి యున్నది యేలాగంటే -

మ॥ జనసంపూజ్య పదారవిందుడగు నాచార్యుండు శోకించి నం।
దను చొప్పారయ వేడి తద్దయు ననుందా నమ్మియర్థింపచా।
వని వానింగరిచావు బుద్ధినిడి యశ్వాథ్థామ జచ్చెన్ నిజం
బనియే బొంకితి మేదినీ భరణ మహించే గురుద్రోహికిన్॥

ఈలాగు ధర్మరాజు తన నేరము తలంచి దుఃఖించెను యిందుకు మూలము కృష్ణుడాయెను అబద్ధములకు తండ్రియైన కృష్ణుని నిమిత్తము ధర్మరాజు నరకము చూచెను గదా - మరిన్ని చూడండి యీ దిగువను వ్రాసిన కందపద్యములో ప్రాణరక్షణ సమయమందు అబద్ధమాడుట దోషము కాదని కృష్ణుడు బోధించెను అది మంచిది కాదు యేమంటే అబద్ధము కల్పించినా మోపినా అట్టి వానికి నరకమే గాని మరియేగతిన్ని లేదని -

**కూర్మపురాణము 5వ ఆశ్వాసములో -**

క॥ పంచమహాపాతకముల
కంచిత విధిగలదు ధాత్రి నన్నృతంబా పా
దించిన దుష్కర్ముల కొ
క్కించుక గతిలేదు నరకమే యూహింపన్॥

అని వ్రాసియున్నది గదా యీ పద్య తాత్పర్యము విచారించినప్పుడున్ను ఆలాగు ధర్మరాజు ఆ దోషము కొరకు దుఃఖించుటయున్ను ఆలోచించి చూడగా కేవలము అంత గొప్ప అబద్ధము కల్పించిన కృష్ణునికి యేగతి సంభవించునో మీరే విచారించి తీర్చండి.

ఓ మా ప్రియ దేశస్థులారా, విష్ణుని గురించిన్ని అతని అవతారములను గురించిన్ని యింత అయోగ్యతగా మీ గ్రంథములే చెప్పుతూ వున్నప్పుడు మేము ఆక్షేపించినామని కొందరు మమ్మును నిందించుట యెందుకు.

ఇదుగో మీ శాస్త్రోక్తుల ప్రకారము మీకు రుజువు చూపిన యిటువంటి అన్యాయగ్రేసరుడైన విష్ణుని యింకా మీరు అరాధించ వలెనో లేక యీపాటి మానవలెనో మీ బుద్ధిని వెలుగులోకి తెచ్చి మీరే ఆలోచన చేయండి.

అయితే అనంత పరిశుద్ధమహిమగల నిజమైన వొక దేవుడు యేసుక్రీస్తనే పేరను పాపుల రక్షణార్థమై యెత్తిన యవతారములో లేశమైన తప్పువున్నట్టయితే ఆయనను మేము అంగీకరించముగదా ఆయన దేవమానుషత్వములలో పరిశుద్ధుడున్ను పరిపూర్ణుడున్ను నిష్కళంకుడున్ను నిర్మాయకుడున్నై యుండుటవల్లనే తగిన రక్షకుడని క్రీస్తుని అంగీకరించితిమి.

అయితే అవివేకులైన కొందరు జనులు దేవుని సర్వశక్తి గ్రహించనేరక పురుష సంయోగము లేని కన్యకా గర్భమందు క్రీస్తు యేలాగు పుట్టెనని అనిష్టముగా మాట్లాడుదురు అట్టివారు తమ గ్రంథములనే చక్కగా తెలుసుకొని యున్నట్టయితే వారు మొగమెత్తి మాట్లాడుదురా లేదే యెందుకంటే - హిందూ పురాణాదులలో కొందరి పుట్టువులను గురించి లజ్జాస్పదమైన యెన్ని అసందర్భములు కల్పించి వ్రాసిరో చూడండి.

భాగవత నవమస్కంధములో యీ అనుచితమైన పుట్టువులను గురించిన పద్యములు.

**క॥ వొకనాడు మనువు తుమ్మిన**
**వికలుడుగా కతని ఘ్రాణ వివరము వెంటన్**
**బ్రకటయశుండిక్ష్వాకుడు**
**సకలంకుడు పుట్టెరవి కులాధీశుండై ॥**

మనువు అనేవాడు వొక దినమందు తుమ్మినాడు ఆ తుమ్ముతో నతని ముక్క రంధ్రములో నుంచి ఇక్ష్వాకుడు అనే రాజు పుట్టెనటని చెప్పియున్నది.

మరిన్ని మాంధాతయను రాజు యువనాశ్వుడనే తన తండ్రి కడుపు చించుకొని పుట్టెనట యిందుకు పద్యము.

**సీ ॥ భూమీశు భార్యకు పుత్రలాభమున**
**కై పోయుతలంపున భూమి సురులు ।**
**జలములు మంత్రించి జలకలశముదాచి**
**నియమంబుతో గూడి నిద్రవోవ ।**
**ధరణీశ్వరుడు నీరు దప్పితో నా**
**రాత్రిధృతిలేక యజ్ఞమందిరము జొచ్చి ।**
**యా నీరు ద్రావిన నంతమేల్కని**
**వారలెవ్వడు ద్రావెనీ రెందుబోయె ॥**

**ననుచు రాజు ద్రావుటంతయు భావించి**
**యెరిగి చోద్యమంది యీశ్వరాజ్ఞ ।**
**నెవ్వడోపుగడువ నీశ్వరునకు**
**నమస్కారమనుచు నేది కార్యమనుచు ॥**

**అర్థము ॥** పుత్రలాభము కొరకై రాజు భార్యనిమిత్తము బ్రాహ్మణులు మంత్రించి వుంచిన నీళ్లు దప్పి చేత తెలియక రాజే ఆ నీళ్లు తాగినాడట అది తెలుసుకొని బ్రాహ్మణులు చింతించిరని వున్నది - తరువాత యువనాశ్వుడనునా రాజుకు గర్భమాయెను అపుడా తండ్రియగు రాజు కడుపు చించుకొని మాంధాత అనేకొడుకు పుట్టెనని వ్రాసిరి.

మరిన్ని వేనుడనే వొక రాజు మిక్కిలి పాపము చేసి చచ్చిన తరువాత బ్రాహ్మణులు వాని భుజములు పట్టి తరిచనందున పృథుడను కొడుకు పుట్టెనని.

**విష్ణుపురాణము 2వ ఆశ్వాసములో వ్రాసియున్నది యేలాగంటె -**

శా॥ అక్షీణప్రకట ప్రతాపనిధి బాహాగర్వదుర్వారశ ।
త్రుక్షోణీశభయంకరుండును జనస్తోత్రుండు సర్వంసహా ।
రక్షా దక్షుడు విష్ణు మూర్తి పృథుడు గ్రస్ఫార తేజంబుతో
సాక్షాదగ్నియుబోలి వేనుని భుజస్తంభారణిన్ బుట్టినన్ ॥

ఈలాగు పృథుడను రాజు చనిపోయిన తన తండ్రి యొక్క భుజములలో పుట్టినాడని వ్రాసిరి. మరిన్ని ఔర్వుడనే ముని తల్లి యొక్క తొడలోనుంచి పుట్టెనని

భారతాది పర్వము 2వ ఆశ్వాసములో వ్రాసియున్నది యేలాగంటే -

క॥ భువనోపప్లవ సమయో ।
ద్భవభానుని భప్రభావిభాసితుడయిభా
ర్గవుడూరు దేశమునను
ద్భవిల్లిమహి వెలుగుచుండెబ్రభుడౌర్వుడనన్ ॥

ఈ ఔర్వుడు నూరు సంవత్సరములు తల్లితొడలోపలను వుండి సకల వేద వేదాంగములు నేర్చి తరువాత పుట్టెనని వ్రాసిరి - యిది యెంత విపరీతమైన కల్పన.

మరిన్ని మందపాలుడను ముని లావుక పిట్టతో వర్తించి ఆ పిట్టవల్ల నలువురు కొడుకుల బడసెనని‌న్ని, ఋశ్యశృంగుడను ముని పెంటి మృగము కడుపున పుట్టెననిన్ని కొందరు స్త్రీలకు చెట్లు పర్వతములుపాములు పిట్టలు యేనుగులు మృగజాతులు పుట్టినట్టున్ను భారతములో వ్రాసిరి - యింకా యిటువంటి అపసవ్యమున్ను, అసందర్భమున్ను, అనుచితమున్ను అయిన పుట్టువులు మీ గ్రంథములలో యెత్తి మేము చూపించ గలము గాని ప్రయోజనము లేదు - అయితే నమ్మవల్లగాని నగుబాట్లు గల పుట్టువులను నమ్ముటయున్ను సర్వశక్తి గల దేవుని ఆత్మ బలమువల్ల యొక కన్యక గర్భవతియై యేసుక్రీస్తనే కుమారుని కనెనని సులభముగా నమ్ముటకు తగియున్న యీ సత్యమును నమ్మక అపహసింతురు యిందువల్ల వారి బుద్ధియేమైపోయివున్నదో మీరే ఆలోచించండి.

# శివుని గురించి విచారింతము

ఇతడున్ను వొక గొప్ప దైవమని యెంచి మన దేశస్థులలో అనేకులు శివుని పూజిస్తూ వున్నారు అయితే మన పూర్వీకులు వ్రాసియుంచిన గ్రంథములను శోధించగా శివుని యందు మిక్కిలి అసహ్యమైన దుష్కార్యములు వున్నట్లు కానవచ్చును - యేలా గంటిరా - విష్ణుడు ఆడు రూపము వహించినప్పుడు శివుని చర్యలు యేలాగు వుండెనో.

**భాగవతాష్టమస్కంధములో వ్రాయబడి యున్నవి చూడండి.**

**గీ॥** వాలుగంటి వాడి వాలారుచూపుల ।
శూలిధైర్యమెల్ల గోలుపోయి ।
తరలియెరుక లేక మరచెగుణంబుల ।
నాలిమరచెనిజగణాళిమరచె ॥

**మ॥** ప్రబలోద్యత్కరిణింగ రీంద్రుడు రమింపన్ వచ్చులీలన్ శివు ।
డబలాపోకుము పోకుమా యనుచు డాయంబారికెంగేలదా ।
కబరీబంధము పట్టి సంభ్రమముతో కౌగిళ్ల నూరార్చె నం ।
తబహిఃప్రక్రియ నెట్ట కేల గదియన్ దద్బాహునిర్ముక్తయై ॥

**సీ ॥** వీడి వెన్నునవాడు వేణిభరంబుతో
జఘన భారాగత శ్రాంతితోడ ।
మా యావధూటియై మరలి చూచుచు
బారు విష్ణునద్భుత కర్మ వెంట దగిలి ।
ఈ శానుమరల జయించెమరుండను
కరణివెన్ చనుకరికరణిదాల్చి ।
కొండలు నేరులు కొలకులు వనములు
దాటి శంభుడు చనదన్మహాత్మ ॥

గీ॥ నిర్మలామోఘవీర్యంబు నేలమీద ।
బడినచోటెల్ల వెండియు పైడియయ్యె ।
ధరణి వీర్యంబువడ దన్నుతా నెరింగి ।
దేవమాయాజడత్వంబు తెలిసె హరుడు ॥

ఈ పద్యముల అర్ధము వివరించి వ్రాసుటకు యుక్తము కాదు మిక్కిలి చెడ్డ మనస్సు గల శివునియొక్క దుర్మోహ వికార చేష్టలు యింతగా మీ గ్రంథకర్తలు వ్రాసియుంచిరి.

మరిన్ని శివుడు పొందిన శాపము యెట్టిదో చూడండి.

కూర్మపురాణము 6వ ఆశ్వాసములో వ్రాసియున్నది. యేలాగంటే -

గీ॥ ఆదినద్దేవదారు వనాంతరమున ।
పుత్రభార్యాసమేతులై పుణ్యకర్మ।
మధికనియమాధ్వరాదికృత్యములొనర్చు ।
తాపసుల మోహితుల చేయదలచి శివుడు ॥

చ॥ సరసిజపత్రలోచనుడు శంకరుడైక్యత నొందినట్లు స్త్రీ ।
పురుష విలాస వేషములు బూని చరింపుచునుండి రొక్కవ।
త్సరమటులుండగాంచియును దత్ప్రకృతి స్థిరమగ్నులై తపో ।
వరసతులీశ మోహవశ వర్తినులై వెసజుట్టిరయ్యెడన్ ॥

క॥ ఆ సంగతులారసిమును ।
లాసరసన్ వచ్చువారి నదలింపుచు ద ।
ద్భాసురగోప్యాంగములిల ।
పై సయ్యనబడ శపింప బ్రవ్యక్తముగన్ ॥

ఈ పద్యము ముఖ్యతాత్పర్యమేమంటే శివుడు జారుడుగానున్న విష్ణుడు జారిణిగానున్న వేషములు వేసి దారుకావనముందున్న ఋషుల భార్యలను మోహింపజేసి శివుడు చెరిపినందున మునులు శపించగా వారి గోప్యాంగములు అనగా విష్ణు, శివులయొక్క యోని లింగములు తెగి పడిపోయెనని చెప్పియున్నది.

ఈ శాపము మరియొక విధము చేత శివునికి సంభవించినట్లు -

పద్మపురాణము 11వ ఆశ్వాసములో వ్రాసియున్నది - యేలాగంటే -

ఋషులందరున్ను కూడుకొని తమ పూజకు అర్హత గల వేల్పు యెవడగునని వితర్కించిరి. అప్పుడు స్వాయంభువ మనువు విష్ణుడు తగునని చెప్పెను. అందుకు వారి సంశయము తీరక శివ, బ్రహ్మ, విష్ణులను శోధించి రాగలందులకు భృగువనే మునిని పంపిరి. అతడు ముందుగా కైలాస గిరికి వెళ్లెను శివుడు, పార్వతితో క్రీడిస్తున్నాడు గనుక అతని దర్శించుటకు యిది సమయము కాదని నందికేశ్వరుడు భృగునితో చెప్పి అటకాయించెను. అయితే ఆ ముని కొన్ని సంవత్సరముల పర్యంతము శివుని ద్వారమందు నిలిచియున్నప్పటికిన్ని శివుడు బైటికి రానందున భృగుడు కోపము తెచ్చుకొని శపించెనని దిగువ వ్రాసిన పద్యములవల్ల తెలుసుకొనవచ్చును.

గీ॥ ఇంతకాలమయ్యె నేదనవాకిట ।
జేరియున్న నన్నుజీరికైన ।
గొనక యింతి మీది కూర్మిమీ దెరుగక ।
మత్తుడయ్యె తన్ను మరిచి హరుడు ॥

సీ॥ యెదిరినిదన్ను మున్నెరుగక తామ
సంబున నింతజేసిన పురహారుండు ।
నేడాదిగాదన నెలతయు దానును
సంగియై ఘనయోని లింగరూప

మూనివర్తింపుచు నుర్వీసురా
వళి పూజకర్హుడు గాకపోవుగాక।
తద్భుక్తశేషాన్న తత్పద జలపుష్ప
ఫలముల నిర్మాల్యములు ననర్హ।

గీ॥ భంగియగుగాక చర్మాస్థి భస్మధరులు -
జటిలులును లింగధరులు పాషండులనగ।
బరగుదురుగాకయని యుగ్రభాషణముల।
నమ్మహాముని శపియించె హరుని ననఘ॥

ఈ పద్యముల అర్థమేమంటే నేను యెంతో కాలమాయెను తన వాకిట నిలిచి యుంటే నన్ను యే మాత్రమైనా లక్ష్యపెట్టక శివుడు మదించి స్త్రీలోలుడై యుండెను. కాబట్టి నేడుమొదలుకొని తానున్ను తన స్త్రీయున్ను యోని లింగాకారులై వర్తింతురుగాక మరిన్ని బ్రాహ్మణులు పూజించుటకు అర్హుడు కాకపోవును గాక శివుని కర్పించిన పదార్థములన్ని పుచ్చుకొనుటకు తగనివి యవును గాక మరిన్ని తోలు - ఎముకలు - బుడిదె - జటలు - లింగములు - ధరించుకొన్న వారందరున్ను పాషండులనబడుదురు గాక అని యీలాగు భృగుముని శివునికి శాపమిచ్చెనని చెప్పిరి.

సిగ్గు పుట్టించే యిటువంటి శివుని చరిత్రలు మీ పురాణముల యందే వున్నవి గాక యివి మా కల్పనలున్ను మా ఆక్షేపణలున్ను కావు గదా -

మరిన్ని శివుడు యెంతమాత్రమున్ను యెగ్యుడు కాదని దధీచి అనే వొక ఋషితో దక్షుడు తిరస్కరించి పలికిన మాటలు వినండి.

కూర్మపురాణము 2వ ఆశ్వాసములో వ్రాసియున్న పద్యము.

చ॥ హరుడశుభ స్వరూపుడు దిగంబరుడుగ్రుడు భస్మలిప్త ధూ ।
సరిత శరీరుడుద్ధతుడు సర్ప విభూషణుడస్థిమాలి కో ।
త్కరభుజ మధ్యలంబితుడు గావున విశ్వమయుండటంచు ని ।
త్తరి బలుకంగరాకు మనృతంబిది సూవెధరాసురోత్తమా ॥

ఈలాగున ఆక్షేపించడమే గాక ఆ దక్షుడు శివునికి శాపము యిచ్చినట్టు-

భాగవత చతుర్థస్కంధములో వ్రాసియున్నది. యేలాగంటే -

క॥ అని యిట్టులు ప్రతికూల వ ।
చనములు దక్షుండు పలికి శపియింతును శ ।
ర్వునియని జలములు గొని కర ।
మున నిలిచిట్లనియె రోషమున ననఘాత్మా॥

క॥ ఇతడింద్రోపేంద్ర పరి ।
వృతుడై ముఖ సమయము సహవిర్భాగము దే
వతలంగూడక మహితని ।
యతి బొందక యుండు గాకయని శపింయించేన్ ॥

తాత్పర్యము యేమంటే - శివుని యెడల దక్షుడు ప్రతికూలముగా మాట్లాడి యితడు యజ్ఞకాలమందు దేవతలతోకూడా హావిర్భాగము పొందక పోవునుగాక యని కోపముచేత నీళ్లధారతో శపించినట్లు చెప్పి యున్నది.

అక్రమములు చేసి శాపములు పొందియున్న శివుని దైవముగా మీరు యెంచి ఆరాధించుటకు తగిన వాడుగా కనిపించుచున్నాడేమో మీరే ఆలోచించి చూడండి.

ఇదిగాక బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురైనప్పటికిన్ని భేదము లేక ముగ్గురున్ను వొక్క దైవముగా యెంచబడుదురనిన్ని కొందరు చెప్పుతున్నారు. మరి కొందరు హరి హర భేదముసేయ కూడదని అంటున్నారు.

అయితే స్నేహితులారా, మీ గ్రంథములను శోధించినప్పుడు బ్రహ్మ, విష్ణులు జగడమాడినారనిన్ని, హరి హరులు ఘోర యుద్ధము చేసినారనిన్ని పరిష్కారముగా కానవచ్చును. యేలాగంటిరా - తమ తమ తారతమ్యముల ఘనత కొరకు బ్రహ్మయున్ను విష్ణువున్ను జగడమాడినారని -

కాశీఖండము 5వ ఆశ్వాసములో వ్రాసి యున్నది ఋషులు బ్రహ్మను యీలాగున అడిగిరి. యేలాగంటే -

గీ॥ **వరద వాగ్వధూ వల్లభ వనజగర్భ ।**
**అడుగ గలదొక సంశయితార్థమిప్పు ।**
**దవ్యయంబగు తత్వమెయ్యదియొ తెలియ ।**
**నంతవట్టును నీవు మాకానతిమ్ము ॥**

ఓ బ్రహ్మ అవ్యయమైన తత్వమేదో అది నీవు మాకు తెలియచేయుమని ఋషులు అడిగిరి.

అప్పుడు బ్రహ్మ అంతటికీ తానే గాని తనకంటే మరియేదిన్ని లేదని గర్వించి పలుకగా అంతట విష్ణువు వచ్చి బ్రహ్మతో అనిన మాటలు యేమంటే -

క॥ **పర్వతత్వమెరుగ కూరక ।**
**పరమ ఋషులతోడ నేన పరముండనుచున్ ।**
**సురలెల్లగాకు నేయగ ।**
**దురహంకృతి పలుక దగునెతో యజగర్భా ॥**

వ॥ వినుము నేను సాక్షాన్నా రాయణుండను యజ్ఞ పరుషుం దనవ్యయ తత్వ శబ్దవాచ్యత్వంబు నా యందును ప్రతిష్ఠితంబు నీవిచ్చట వలవని పెద్దరికంబున కడిచి పడకుండు మనియె నట్లిద్దరుంబరస్పర జయార్థులగుచు వాదంబు విడిచి తమ తారత మ్యంము లామ్నాయంబుల నడిగిరప్పుడు ఋగ్వేదం బిట్లనియె ॥

యిక్కడ పద్యములు వ్రాయలేదు - అయితే ఋగ్వేదము - యజుర్వేదము - సామవేదము - అదర్వణ వేదము - యీ నాల్గున్ను సీసపద్యములతో కేవలము శివుడే పరతత్వముగాని యంతనికంటే మరియెవరు అధికులు లేరని పలుకగా అందుకు బ్రహ్మసహించలేక ఆ నాల్గు వేదముల మాటలు నిజము చెయ్యక శివుడు పరతత్వము కానేరడని శివుని తిరస్కరించెను - చివరకు ప్రణవము వచ్చి చెప్పినా బ్రహ్మ వినక పోయెనని వ్రాసియున్నది.

ఆ సమయమందు బ్రహ్మ, విష్ణులకు మధ్యను వొక తేజస్సు పుట్టి ఆ తేజో మధ్యమున శివుడు ప్రత్యక్షమాయెను. అది చూచి బ్రహ్మతన యయిదవ ముఖముతో పలికిన మాటలు యేవంటే -

**గీ॥ డమరుధర నీవు నా లలాట స్థలమున ।**
**తొల్లి జనియించితివి తేట తెల్లమిగను ।**
**రోదనపుహేతువున నీకు రుద్రనామ ।**
**మపుడు ఘటియించినాడ నేనలఘుమహిమ ॥**

**వ॥** అట్లుగావున నీవు నాకుంబుత్రుడవునన్ను శరణంబు చొచ్చి నా వలనం బరీక్షగావించి బ్రతుకుమనుచు దురాలాపంబులపలికె. భర్గుండు నఖర్వంబగు తదీయ గర్వంబు సహింపక నితాంత రోష సంభవంబున విజృంభించిన. వీటి తాత్పర్యము॥ శివుడా నీవు తొల్లి నా నుదుటను పుట్టి రోదనముచేసినందున గదా నీకు రుద్రుడను పేరిచ్చితిని. కాబట్టి నీవు నాకు కుమారుడవు నన్ను ఆశ్రయించి బ్రతుకుము - అని యీలాగు బ్రహ్మ చెడ్డ మాటలాడగానే శివునికి మహాకోపము పుట్టి ఆవలించినప్పుడు భైరవుడు పుట్టి శివుని ఆజ్ఞ చేత బ్రహ్మయైదవ శిరస్సును ఖండించెనని వ్రాసియున్నది. మరిన్ని శివకేశవుల యుద్ధమును గురించి -

భాగవత దశమస్కంధోత్తరభాగములో వ్రాసియున్నది. యేలాగంటే –

మ॥ అనలాక్షుండుత్రిలోక పూజ్యమగు బ్రహ్మాస్త్రంబరింబోసి యా
వనజా తేక్షణు మీద క్రోధమహిమ వ్యాకీర్ణుడై యేసెనేసి
న నద్దివ్య శరంబు వెంటనే మరల్చెన్ గృష్ణుడత్యుద్ధతిన్
జనితాశ్చర్యరసాబ్ధి మగ్నులగుచున్ । శక్రాదులగ్గింపగన్ ॥

ఉ॥ పాయని కిన్కతో హరుడు పాశుపతాస్త్రము నారిబోసినం ।
దోయ రుహాయతాక్షుడును తోడనెలోక భయంకరోగ్రనా ।
రాయణ బాణ రాజము రయంబున సేసి మరల్చెదా నిజ ।
క్రాయుధుడి త్తెరంగున పురారిశరావళి రూపు మాపినన్ ॥

ఈలాగున యుద్ధము జరిగినప్పుడు కృష్ణుడు సంమోహానాస్త్రముతో శివుని వేయగా శివుడు తన వాహనమైన యెద్దు గుంపము మీద పరవశుడై పడెనని తరువాత శివుడు లేచి మూడు బుర్రలున్ను నాల్గు పాదములున్ను గల శివ జ్వరమును కృష్ణుని మీదికి పంపించగా కృష్ణుడు దాని మీదికి వైష్ణవ జ్వరమును ప్రయోగించెను. ఆ రెండు జ్వరములున్ను పోరాడిన పిమ్మట శివజ్వరము వీగి పారిపోయి యెక్కడ దిక్కుగానక కృష్ణుని యొద్దికి వచ్చి శరణుజొచ్చి బ్రతికెనని బాణాసుర యుద్ధకథ యందు వ్రాసియున్నది.

ఈ రుజువువల్ల బ్రహ్మ విష్ణు శివులయొక్క జగడములున్ను యుద్ధములున్ను భేదములున్ను చూపించితిమి. యిటువంటి త్రిమూర్తులను యింకా దైవములని యెంచి మీరు పూజించ వలెనో లేక యీపాటి మానవలెనో మీరే ఆలోచించండి.

# గురువులను గురించి విచారింతము

ముందుగా దేవతలకు గురువైన బృహస్పతిని గురించి విచారించినట్టయితే అతని యందు తగిన మంచి నడతలు అగుపించ లేదు. అతడు తన అన్న భార్యతో యెంత చెడ్డ కార్యము జరిగించెనో చూడండి. యిందును గురించి -

**భాగవత నవమస్కంధములో వ్రాసియున్నది. యేలాగంటే -**

**సీ॥** అన్న యిల్లాలు చూలాలిని మమతాఖ్య
జూచి బృహస్పతి సురతమునకు।
దొరకొని పైబడ్డ తొల్లి గర్భంబున నున్న
బాలుడు భయంబొదవి వలదు।
తగదని మొరలెట్ట తమకంబుతో వాని
నంధుండవగుమన్న నలిగివాడు।
యోనిలోపలి వీర్యమూడ దన్నిన
నేలబడి బిడ్డడై యున్న బాయలేక।

**గీ ॥** నితని పెంచుకొడుకు లిరువురు జన్మించి।
రనుచు వెలయజేయుమనిన మమత
బెంపజాల నీవ పెంపు భరింపుమీ।
ద్వాజననుచు జనియె దాని విడిచి ॥

**వ॥** ఇట్లు రుచథ్యుని భార్యయగు మమతయు బృహస్పతియు శిశువుంగని ద్వాజుండైన వీని భరింపుమని వదినె మరుదులు దమలో నొండొరులంబలికిన కారణంబున వాడు భరద్వాజుండయ్యె గర్భంస్థుండైన వాడు బృహస్పతి శాపంబున దీర్ఘతముండయ్యెనంత నా బృహస్పతియు మమతయు నుదయించిన వాని విడిచి నిజేచ్ఛంజనిన మరుత్తులు వానింబోషించి పుత్రార్థియైన భరతునకిచ్చిరి భరతుండును వానింజేకొనియె।

ఈ పద్యముల తాత్పర్యము వివరించి వ్రాయకూడదు బహు అసహ్యమున్ను సిగ్గున్ను మిక్కిలి అపవిత్రమున్ను అయన కార్యములు యిందులో వున్నవి దేవతా గురువుకు యిది తిగిన కార్యమా కేవలము నగుబాటుకున్ను పాపమునకున్ను హేతువై యున్నది. కాదా.

మరిన్ని రాక్షసులకు గురువైన శుక్రుని గురించి విచారింతము శుక్రుడనే పేరు యతనికి యేలాగు వచ్చెనో దాని గురించి.

భారత శాంతిపర్వము 5వ ఆశ్వాసములో వ్రాసియున్నది యేలాగంటే -

శుక్రుడు - కుబేరుని మోసపుచ్చి అతని ధనమంతా పుచ్చుకొన్నందున కుబేరునికి మిత్రుడైన శివునికి కోపము వచ్చి శుక్రుని వెంటాడి పట్టుకొని వానిని మ్రింగివేసెను - తరువాత శివుడు తన శరీరరంధ్రములన్ని మూసి శిశ్నరంధ్రము మూయక ఆ త్రోవనుబైటికి రమ్మనగా శుక్రడు ఆలాగే వచ్చెను అప్పుడు పార్వతి వాని చంపనివ్వక కొడుకుగా భావించుకొనెనని వ్రాసియున్నది - యిందుకు పద్యము.

**గీ॥ అనిన తేజస్విజేసి చంద్రార్ధమౌళి ।**
**శిశ్నమున నిగమించుట జేసి యితడు ।**
**శుక్రుడనె పేర వర్తించు సుదతినీకు ।**
**బ్రియమొనర్చితిననియె సంప్రీతితోడ ॥**

శివుని యొక్క శిశ్న రంధ్రములో నుంచి వెలికి వచ్చుటవల్లను శుక్రుడనే పేరు పొందినాడట.

మరిన్ని యింత గొప్ప పేరు పొందిన శుక్రుడు నిషేధించబడిన సురాపానమందు అధిక ప్రియుడట. అందుకొరకు రాక్షసులు బృహస్పతి పుత్రుడైన కచుని చంపి కాల్చివేసి ఆ బూడిదె కల్లులో కలిపి తమకు గురువైన శుక్రునికి తాగనిచ్చిరని.

భారతాది పర్వము మూడో ఆశ్వాసములో వ్రాసియున్నది యేలాగంటే -

కII అడవిని పువ్వులుగోయగ ।
వడినరిగిన కచుని జంపి వానిని దనుజుల్ ।
పొడవు సెడగాల్చి సురతో
తడయక యబ్బూది శుక్రుదాగించి రోగిన్ ॥

ఈలాగు శుక్రుడు తాగి తరువాత తెలివి పొందెనట. మరిన్ని శుక్రుడు బలిచక్రవర్తిని అబద్ధమాడనచ్చునని బోధించినట్టు,

భాగవతాష్టమస్కంధములో వ్రాసియున్నది యేలాగునంటే

గీ ॥ వారి జాక్షులందు వైవాహిక ములందు ।
ప్రాణవిత్తమాన భంగములను ।
చకిత గోకులా గ్రజన్మరక్షణమున ।
బొంక వచ్చునఘము బొందదధిప ॥

అబద్ధమాడ వచ్చునని యీలాగున దుర్బోధచేసిన శుక్రాచార్యునికి శిష్యుడైన బలిచక్రవర్తి యిచ్చే ప్రత్యుత్తరమేదంటే -

గీII బ్రతుకు వచ్చుగాక బహుబంధనములైన ।
వచ్చుగాక లేమి వచ్చుగాక ।
జీవధనము లైన జెడుగాక ।బడుగాక ।
మాట దిరుగలేరు మానధనులు ॥

మII నిరయంబైన నిబద్ధమైన ధరణీనిర్మూలనంబైనదు ।
ర్మరణంబైన కులాంతమైన యశమున్ రానిమ్ము పోనిమ్ము శ్రీ ।
హరియైనన్ హరుడైన నీరజ భవుండభ్యాగుతుండై ననౌ ।
తిరుగన్నేరదు నాదు జిహ్వవినుమో ధీవర్యవెయ్యేటికిన్ ॥

యెటువంటి నష్టము సంభవించినా అబద్ధమాడకూడదనిన్ని నేను అబద్ధమాడనని బలిచక్రవర్తి యీలాగు పలికెను గదా యీ యిద్దరిలో మంచివాడు యెవడు - అబద్ధమాడుమని నేర్పే గురువా - లేక యెంత మాత్రము అబద్ధమాడనని పలికే శిష్యుడా వీరిలో యెవడు మంచివాడో మీరే ఆలోచించండి.

దేవదానవులకు గురువులైన బృహస్పతి శుక్రులనే యీ మొదటివారే యింత అక్రమముగా వర్తించినప్పుడు తక్కిన నరగురువుల నడువడి మరి యెంత హద్దు మీరి వుండును - అది వివరించ పనిలేదు.

## బ్రాహ్మణులను గురించి విచారింతుము

భారతాదివర్వము 2వ ఆశ్వాసములో బ్రాహ్మణ లక్షణములను గురించి వ్రాసియున్నది. యేలాగంటే -

ఉ॥ **భూనుత కీర్తి బ్రాహ్మణుడు పుట్టగతోడనే పుట్టునుత్తమ ।**
**జ్ఞానము సర్వభూతహితసంహిత బుద్ధియు చిత్తశాంతియున్ ।**
**మానమదప్రహారము శమత్వము సంతత వేద విధ్యను ।**
**ష్ఠానము సత్యవాక్యము దృఢవ్రతమున్ గరుణా పరత్వమున్ ॥**

తాత్పర్యము యేమంటే - వుత్తమ జ్ఞానము సర్వజీవుల యెడల ప్రియమైన హితబుద్ధి చిత్త శాంతి మదగర్వాదులను కొట్టివేయుట క్షమింపు విధి ప్రకారమైన నిత్యానుష్ఠానము సత్యవాక్యము దృఢవ్రతము దయాళుత్వము యిటువంటి గుణములు బ్రాహ్మణుని పుట్టువుతోడనే పుట్టుకొని వచ్చునని చెప్పి యున్నది బ్రాహ్మణుడు యిట్టివాడని వుండగా మా ప్రియదేశస్థులారా యిప్పుడు మీలో బ్రాహ్మణులనిపించుకొని యనేకులు వున్నారు గదా వారి గుణప్రవర్తనలు శోధించండీ నిజమైన బ్రాహ్మణత్వము లేశమైనా కనిపించునేమో యెంతమాత్రము కానరాదు.

ఇదిగాక యీ బ్రాహ్మణులలో వైష్ణవులనే వారు చాలామంది గురువులని మీ వల్ల యెంచబడుతున్నారు గదా - ఆ వైష్ణవులు యెటువంటివారై యుండవలెను.

విష్ణుపురాణము 4వ ఆశ్వాసములో వ్రాసియున్నది. యేలాగంటే -

గీ॥ **శత్రుమిత్రులందు సమబుద్ధియైనిజా।**
**చారవర్తనముల చలనముడిగి।**
**యల్పమైన నధికమైన పరద్రవ్య।**
**వాంఛలేని వాడెవైష్ణవుండు॥**

ఈలాటి వైష్ణవుడు యెక్కడ యేడీ వోహో యిటువంటి లక్షణములు విష్ణుని యందే లేనప్పుడు అతని భక్తులైన వైష్ణవులకు యేలాగు వచ్చునని మేము చెప్పక మునుపే మీకు తోచవచ్చును.

యితర జనులకంటే యే గుణ లక్షణముల యందైనా ఆధిక్యత కనిపించని బ్రాహ్మణులనున్ను వైష్ణవులనున్ను పుజార్నులుగా మీరు వారిని యెంచుకొనుటవల్ల యే ఫలము మీకు లభించునో మీరే ఆలోచించండి.

మరిన్ని గంగాది నదులలో మునుగుటవల్ల బహుపుణ్యమని మీ గ్రంథకర్తలు వ్రాసిరి. అయితే స్నానములు నిష్ఫలమని అది కూడా వ్రాసియుంచిరి.

కాశీఖండము 5వ ఆశ్వాసములో గంగా స్నానఫలము వ్రాసి యున్నది యేలాగంటే -

క॥ **ఏలా వుపవాస వ్రత।**
**మేలా యష్టాంగయోగ మేలా యజ్ఞం।**
**బేలా తపంబు గంగా**
**కూలంకషతీర్థమాడ గూడినయేనిన్॥**

గంగా స్నానము చేసినందువల్ల యెంత ఫలము చెప్పి యున్నదో యీ పద్యములోనే చూడండి.

ఇందుకు విరోధముగా ఈ గ్రంథములోనే 3డో ఆశ్వాసమందు ఆగస్త్య ముని లోపాముద్రయను తన భార్యతో చెప్పిన విధము యేమంటే-

**చ॥ బిసరుహ పత్రలోచన కృపీటములందు మునింగి యాడవే ।**
**మొసళులు మీలు కర్కటకముల్ గమఠంబులు వాటికబ్బునే ।**
**యసదృశమైన తీర్థ ఫలమట్టి విధంబు సుమీతలంప మా ।**
**నసమగు తీర్థమాడని జనంబులకున్ బహు బాహ్యతీర్థముల్ ॥**

గంగాది తీర్థస్నానములు నిష్ఫలమని పైని వ్రాసిన పద్యమువల్ల యెంత తేటగా కనిపించుచున్నవో చూడండి. వొక్క గ్రంథములోనే యిటువంటి విధినిషేధములు వ్రాసియుంచిరి. యీలాగే మీలో వున్న బహు విధగ్రంథముల యందు విధి నిషేధములు విస్తారముగా వున్నట్టు మేము మీకు రుజువు పర్చగలము అయితే గ్రంథ బహుళ్యమౌను గనుక యింతమట్టుతో చాలింతుము.

ప్రియమైన మా దేశస్థులారా, మేము మీ మతములనైనా మీ గురువులనైనా మీ యిష్టదైవములనైనా ఆక్షేపించ లేదు. దూషించుట లేదు. ఇదుగో మీ గ్రంథకర్తలే ఆ యాక్షేపణలు వ్రాసియుంచిరి - వారే ఆ దూషణలు నిలిపిరి కాబట్టి మేము యీ మట్టుకు చూపించిన రుజువులవల్ల యికను మీలో బుద్ధిమంతులైన వారు మమ్మును నిందించబోరని తలంచుచున్నాము.

యిప్పుడు మేము మిక్కిలీ వినయపూర్వకముగా మీకందరికీ తెలియచేయ గల అగత్యమైన సంగతియేదంటే మేము నమ్మిన రక్షకుడైన యేసుక్రీస్తును గురించి మీరున్ను బాగా శోధించి తెలుసుకొనవలెననిన్ని తెలుసుకొన్నమీదట ఆయన మీ పాపములను పరిహరించుటకున్ను మీకు

నిత్యానందమైన మోక్షము యిచ్చుటకున్ను తగిన వాడుగా మీ అంతర్నేత్రములకు కనిపించినట్టయితే ఆయన యందు భక్తి విశ్వాసములు వుంచి మీరు ఆయనను వెంబడించవలెనన్ని యిదే మీకున్ను అగత్యమైయున్నదని చెప్పి మిమ్మును బతిమాలుతున్నాము.

అయితే మీరు ఆ ప్రియ రక్షకుడైన క్రీస్తును తెలుసుకొనేటందుకు దివ్యమైనదొక మంచి శాస్త్రము గలదు - దాని పేరు బైబిలని చెప్పబడి యున్నది. అవొక్కటే ప్రత్యక్షప్రమాణములు గల పరిశుద్ధ సత్యవేదము. అది మనుష్య కల్పనలవల్ల రచించబడిన గ్రంథములవంటిది కాదు. అపరిమిత పరిశుద్ధ నీతి న్యాయములు గల యొక్కడైన దేవుని పరిశుద్ధాత్మ ప్రేరేపణవల్లను వ్రాయించబడెను. ఆ వేదపుస్తకము పురాతనమున్ను నూతనమున్ను అయిన వొడంబడికెలని రెండు భాగములుగా యేర్పడి యున్నది. పురాతనపు వొడంబడికెలో క్రీస్తు విషయమై భవిష్యత్కాలములో జరగబోయేవాటిని గురించి చెప్పి యున్నది. నూతనపు వొడంబడికెలో ఆ భవిష్యత్సంగతునలన్ని చక్కగా నెరవేరినట్లు చెప్పియున్నది. ఈ నూతనపు వొడంబడికె గ్రంథమును సువార్త యని యందురు ఇదే క్రీస్తు మత సిద్ధాంతమునకు మూలధారమై యున్నది యిందులో యిమిడియున్న ముఖ్య సంగతులు యేవంటే -

దేవుని కుమారుడైన యేసుక్రీస్తు నరావతారమెత్తి అతి పవిత్రమైన దివ్య బోధనలను ప్రజలకు బోధించి తన మనుష్యత్వములో యెల్లప్పుడు నిరపరాధియై ప్రవర్తించి సకల జనోపకారియైయుండెను. తన దేవత్వములో గొప్పవైన యద్భుత కార్యములు జరిగించెను ఈలాగున ఆయన 33 సంవత్సరములు భూమి యందు వుండి తరువాత నరసంతతుల పాపవిమోచనార్థమై తన పుణ్య శరీర రక్త ప్రాణములు దేవునికి బలిగా చెల్లించెను. క్రీస్తు పాపాత్ముల నిమిత్తము మరణము పొంది మూడవ దినమున జీవముతో తిరిగీ లేచి ఆకాశమునకు యెక్కిపోయి యిప్పుడు దేవుని యొద్ద వున్నాడు. ఆయనమళ్లీ ఆకాశమునుంచి దిగి వచ్చి చని పోయిన జనులందరినీ లేవనెత్తి న్యాయము తీర్చి వారి వారి క్రియల ప్రకారము ఫలములు యిచ్చును.

నిజమైన దేవునిన్ని ఆయన పంపిన క్రీస్తునున్న నమ్మి పాపక్షమాపణ పొంది భక్తిగా నడుచుకున్నవారి కందరికీ ఆయన మోక్షముయిచ్చును. అయితే నమ్మక దుర్మార్గతతో నడుచుకున్న వారందరికీ ఆయన నరకముయిచ్చును.

యెటువంటి పాపాత్ముడైనా నిజముగా క్రీస్తును నమ్మినట్టయితే వాడు రక్షణ పొందుననుటకు యెంత మాత్రమైనా సందేహము లేదు. నీతి మంతులమని అనుకొనేవారిని కాదు. మనస్సు తిప్పుకొనిన పాపాత్ములనే రక్షించుటకు ఆయన నిరంతరము సిద్ధముగా వున్నాడు. యీసువార్త యొక్క సారాంశములుయీ వుత్తరములో క్లుప్తముగా వ్రాసి మీకు తెలియచేస్తిమి.

ప్రియమైన మా దేశస్థులారా, యింకా విశేషమైన సంగతులు వివరముగా తెలుసుకొనుటకున్ను సత్యమైన వేదపుస్తకములు మన దేశభాషతో అచ్చుపడియున్నవి గనుక అవి సులభముగా సంపాదించు కొనుటకున్ను ప్రభువైనయేసు క్రీస్తును వెంబడించి నిత్యజీవము పొందుటకున్ను మీలో ఆశ గలవారందరూ విశాఖ పట్టణముకనైనా లేక క్రీసుతమత భోధకులు వుండే యితర స్థలములకైనా వెళ్లి ప్రయత్నము చేసినట్టయితే దేవుని కృపవల్ల సిద్ధి పొందుదురు.

రండీ! ఆలస్యము నేయక త్వరగా రండి. వచ్చి క్రీస్తుయొద్ద రక్షణను పొందండి. దేవుడు ఆశీర్వదించి మాప్రియదేశస్థులైన మీకందరికీ తన కృపాభాగ్యము దయచేసునుగాక. మీ స్నేహితులమున్ను క్రీస్తు సేవకులమున్నయిన మేము మీ క్షేమము కోరి మీ కొరకు దేవుని ప్రార్థిస్తూ మీ యెడల విధేయతగా వున్నాము.